నవంబర్ - 2016

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక


ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-



**మా చిరునామా :**

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

సెల్ : 9704255416


## లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| బర్నబా | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 05 |
| చీకటి నుండి ఆశ్చర్యకరమైన వెలుగులోకి | షేక్ జాని సాక్ష్యము | 07 |
| బైబిలు ప్రాముఖ్యత | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 10 |
| రెండు కాసులు | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 18 |
| ఏడు సంఘాలు - తుయతైర సంఘము | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | 13 |
| లూధియ | శ్రీమతి రేచల్ జోసఫ్ | 15 |
| బాంబులు పట్టిన చేతిలో బైబిల్ | మైఖేల్ విజయకుమార్ సాక్ష్యము | 16 |
| లోకంతీరు | ఇమ్మానియేలు రాజేంద్ర | 18 |
| బైబిల్ కథలు | మామయ్య కథలు రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 20 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 24 |


India Evangelistic & Relief Fellowship

| **EVANGELISM** | **RELIEF** |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelistic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Lepers Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International Ministry | Children Care Ministry |
| Hanna Women Ministries | |


**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు ప్రభువు నామమున శుభాభివందనములు.

గత నెల పత్రిక ద్వారా మేము పంపిన మనియార్డరు ఫారములను ఉపయోగించుకొని చందా పంపించిన వారికి కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను. చందాదారులకు క్రిస్మస్ కానుకగా రూ.25,000/- విలువగల బహుమతులను అందజేయటానికి నిర్ణయించాము. ఇప్పటి వరకు చందా కట్టిన వారి సీరియల్ నంబర్స్‌ను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి బహుమతులను ఇస్తాము. వివరాలు పత్రికలో చూడవచ్చును. గత నెలలో మరలా 200 మందికి మనియార్డరు ఫారాలు పంపించాము. కొంతమంది బ్యాంక్ అకౌంట్ ద్వారా చందా పంపించారు. ఇప్పటి వరకు పత్రిక కావాలని ఇంటర్నెట్ ద్వారా రిజిస్టరు చేసుకున్న వారి సంఖ్య 300లకు దాటింది. కాబట్టి ఇప్పటి వరకు పత్రిక పొందుతున్నవారు చందాకట్టవలసినగా కోరుతున్నాము. ఒకవేళ మీరు డిసెంబర్‌లోగా చందా పంపలేకపోతే, జనవరి-2017 నుండి వరుసక్రమంలో పత్రిక ఆపివేయ బడుతుందని తెలియజేయుటకు చింతిస్తున్నాను. కావున మీ సంవత్సర చందాను వెంటనే పంపించగలరని ఆశిస్తున్నాను. మీరు బ్యాంక్ అకౌంట్ ద్వారా ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేయదలచినట్లయితే మా అకౌంట్ నంబర్‌కి ట్రాన్స్‌ఫర్ చెయ్యండి. K. Joseph, A/c No. 10957380353, SBI Main Branch, Ongole, IFSC Code SBIN0000890. మీరు ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేసినట్లయితే దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. చందాదారుల వివరాలను పత్రికా ముఖంగా ప్రచురిస్తున్నాము. ఒకవేళ మీరు చందా కట్టినప్పటికీ మీ పేరు చందాదారుల లిస్టులో లేనట్లయితే వెంటనే మాకు తెలియజేయండి. గత నెలలో బైబిల్ క్విజ్-23కి 27 మంది జవాబులు పంపించారు. ప్రకటించిన విధంగా లక్కీడిప్ ద్వారా ఒకరికి 'నా చిత్తానుసారుడు' అను పుస్తకమును పోస్ట్‌ద్వారా పంపిస్తాము. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

**K. Joseph, SBI Main Branch, Ongole**
**A/c No. 10957380353**

-ఎడిటర్

సీరియల్

# బర్నబా

6

**(అపొస్తలుడు రెండవభాగం)**

**- కొడవటికంటి**

ఆ రాత్రి భోజనమునకు ముందు నెఫేగు ఇంటి ముందు ఇద్దరు గుఱ్ఱపు రైతులు ఆగారు.వాళ్ళు లోనికి వచ్చి నెఫేగును పలకరించి సెర్గిపౌలస్ అనబడే ఆ దేశాధికారి రోమా అధిపతి బర్నబా యొక్క బోధ వినాలని ఆశ కలిగియున్నందున తన గృహమునకు రేపు రావలసినదిగా ఆహ్వానించుచున్నాడని చెప్పి వెళ్ళిపోయాడు. ఈ విషయం వినినప్పుడు మార్కు చాలా సంతోషించాడు .తన మామ ఎంత గొప్పగా ఈ రాజ్యములో గౌరపరచబడుచున్నారు అని. ఆ రాత్రి బర్నబా పౌలు చాలా సమయం ప్రార్ధనలో గడిపారు. ఉదయం పది గంటలకు బయలుదేరి సెర్గిపౌలస్ రాజమందిరం చేరారు. అక్కడ ఆదరంగా స్వాగతం లభించింది. సెర్గిపౌలస్ గొప్ప పండితుడు. దాదాపు పదిహేను సంవత్సరముల క్రితం యెరూషలేములో లేచిన విప్లవం, యేసు అనబడే నజరేతు ప్రవక్త శిలువలో మరణించి పునరుత్థానుడైనట్లు విన్నాడు.

తర్వాత నాలుగు సంవత్సరాలకు ఆయన శిష్యులను యూదులు బహుగా హింసించిరని అందువలన అనేకులు ఈ కుప్ర దేశమునకు శరణార్ధులుగా వచ్చియున్నారని విని యున్నాడు. ఆ యేసుని నామమును విశ్వసించిన వారు ఆసియా అంతట ఉన్నారని ముఖ్యంగా ఈ కుప్రలోను, ఫినీషియాలోను, అంతియొకయ నగరంలో మరి ఎక్కువగా ఉన్నారని విన్నాడు. ఇప్పుడు, ఒకప్పుడీ దేశవాసి అయిన యోసేపు, బర్నబా పేరుతో ఆయన నామము ప్రకటిస్తున్నారని విని వారిని చూచి వారి మాటలు వినాలని ఆహ్వానించాడు.

చక్కగా అలంకరించబడిన పెద్ద గదిలో సేర్గిపౌలస్ తమ బంధువులతోను కుటుంబ సభ్యులతోను, పుర ప్రముఖుల తోను ఎదురు చూస్తున్నాడు. బాహ్యాలంకరణ లేకున్నను బర్నబాగారు తన బృందంలో తాము రాయబారులమనే అంత హుందాగా లోనికి ప్రవేశించారు. సెర్గిపౌలస్ సభలోని ముఖ్యులను బర్నబాకి పరిచయం చేసి చివరలో తన వెనుక దాగినట్లు నిలిచిన వ్యక్తిని 'ఎలుమ' బర్‌యేసు అని పరిచయం చేస్తుంటే ఆ గారడి వాడు వెకిలిగా నవ్వాడు.

బర్నబా మిగిలిన వారు ఆసీనులైన తర్వాత సెర్గిపౌలస్ "మరణించిన ప్రవక్త తిరిగి లేచెనని మీరు చెప్పుచున్న ఈ సంగతి మాకు వివరిస్తారా?" అన్నాడు.

వెంటనే ఆయన వెనుక సింహాసనమునకు ఆనుకొని యున్న ఎలుమ వంగి సెర్గిపౌలస్ చెవిలో ఏదో చెప్పాడు.

బర్నబా పౌలు వైపు చూశాడు. పౌలు బర్‌యేసు వైపు చూస్తున్నాడు. బర్నబా పౌలును చిన్నగా పిలిచారు. పౌలు తన ముఖం ఇటువైపుగా త్రిప్పి బర్నబా వైపు చూసి లేచి రెండడుగులు ముందుకు వేసి సెర్గిపౌలస్ వైపు అభివందనము చేస్తున్నట్లుగా వంగి ప్రభువైన యేసును గూర్చిన వర్తమానము ప్రారంభించగానే కూర్చునియున్న వారి ముఖాలన్ని గంభీ రంగా మారిపోయినవి. పౌలు పలుకులోని గాంభీర్యత అందరిని ఆకట్టుకొన్నది. భక్తి శ్రద్ధలతో తదేక దృష్టితో సెగ్గిపౌలస్ తన ప్రసంగం వినుటను ఆయన వెనుక నిలుచుని ఉన్న ఎలుమ మాటిమాటికి వంగి ఆయన చెవిలో ఏదో చెప్పటం తన సువార్తను బర్‌యేసు అడ్డుకుంటున్నట్లుగా తోచింది. అతని పేరు ఎలుమ. ఔను గారడీ వాడే. పౌలు ఎలుమ ముఖం చూసినప్పుడు అతని ముఖం కారు మబ్బు కమ్మినట్లుగా కనిపించింది.

పౌలు ప్రసంగ సరళి మారినట్లుగాను అతని కంఠంలోని తీవ్రతను గమనించిన బర్నబా, మార్కు ఆశ్చర్యపోయారు. ఇంతకు ముందు పౌలు ముఖం ఎన్నడును వారు ఇలా చూడలేదు. మనిషి కూడా మూరెడు పెరిగినట్లు అనిపించింది. "మీకు ఈ నామము ద్వారానే పాప క్షమాపణ ప్రచురమగు చున్నది" అని పౌలు అంటున్నప్పుడు ఎలుమ మరలా అధిపతి తల వద్దకు వంగి ఏదో చెప్పబోయాడు. ఇంతలో...

"సమస్త కపటముతోను, సమస్త దుర్మార్గముతోను, నిండిన

వాడా!" అన్న మాటలు ఉరుమువంటి శబ్దంతో ఆ ప్రాంత మంతా నిండినట్లు వినిపించింది.అందరు ఒక్కసారిగా ఉలిక్కి పడినట్లుగా అయిపోయారు. ఇంతకు ముందు ఆప్రాంతంలో ప్రవేశించిన పౌలు కాక రూపాంతం పొందిన వేరొక పౌలును అందరూ చూశారు. సెర్గిపౌలస్ పౌలు వైపు అమితాశ్చర్యంగా చూస్తున్నాడు. పౌలు ఎలుమ వైపు తీవ్రంగా చూస్తూ కుడి చేయి అతని వైపు చూపిస్తూ . "అపవాది కుమారుడా" అని అన్నప్పుడు ఎలుమ నడుములు వంగిన వారివలె కనిపించాడు. "సమస్త నీతికి విరోధీ నీవు ప్రభువు యొక్క తిన్నని మార్గములు చెడగొట్టుట మానవా?" అన్నప్పుడు ఎలుమవైపు చూస్తూ కొంచెం నిదానంగా రోగికి వైద్యం చేస్తున్న వానివలె కొంతకాలం గ్రుడ్డివాడవై సూర్యుని చూడకుందువు అని అంటుండగానే ఆ గదిలో ఎలుమ చుట్టూ మాత్రము మేఘము చీకటిగా అతనిని క్రమ్మింది. కొంచెంసేపు ఎలుమ అక్కడి వారికి తెరచాటునున్న మనిషివలె కనిపించాడు.

అందరూ మంత్ర ముగ్దులు అయిపోయారు. ఆ మేఘం విడిపోయిన తర్వాత బర్‌యేసు గ్రుడ్డి వానివలే చేతులు ముందుకు చాచి బయటకు దారి వెతుకుతున్నాడు.

సెర్గపౌలస్ లేచి నిలబడి దగ్గరలో ఉన్న భటునితో బర్‌యేసును బయటకు తీసికొని వెళ్ళమని చెప్పాడు. ఆ తర్వాత పౌలు వైపు తిరిగి వినయపూర్వకంగా "తమరు కూర్చోండి పౌలు" అన్నాడు.

బర్నబామార్కు ఒకరినొకరు చూచుకొన్నారు. సెర్గిపౌలస్ తన పేరు పౌలు కాబట్టి సౌలుని పౌలు గారు అంటున్నారా? లేక పౌలుగారికి రోమ పౌరసత్వము ఉన్నది కాబట్టి సౌలు అనే పేరు గ్రీకు భాషలో పౌలు అన్నాడో అర్థం కాలేదు. అయితే ఆత్మావేశంలో ఉన్న సౌలు అందునుండి తేరుకొనే లోపల ఆయన నోటినుండి పౌలు అనే మాట బర్నబా విన్నారు. బర్నబా కూడా ఆయనకు తెలియకుండానే పౌలు అనటం ప్రక్కనే కూర్చున్న మార్కు విన్నాడు.

రెండు రోజులు సెర్గిపౌలస్ గారింటిలోనే బస చేసి వారం దరికి పూర్తి సువార్త బోధించి బాప్తిస్మం ఇచ్చారు.ఇక తమ ప్రయాణం పెర్గెకు. మార్కు సామాను సర్దుతున్నాడు. తన తల్లిని చూడాలని ఆశ. అది కాక ఇక్కడ అన్యజనుల మధ్య నివసించే వారితో కలసి భోజనం చేయడం తన హృదయానికి ఎంతో బాధ కలిగిస్తుంది. పాపు పట్టణం వచ్చే వరకు ఏ నిర్ణయమైన తన మామ బర్నబా తీసుకొనేవారు. కాని కొద్ది రోజులుగా బర్నబా చిన్న విషయమైన పౌలుతో సంప్రదించు చున్నాడు. ఇప్పుడు అందరు సౌలుని పౌలు అని పిలుస్తున్నారు. సౌలు ఆ పేరును స్వీకరించినట్లుంది. తన మామ కూడ పౌలు అని పిలుస్తున్నాడు.

మార్కు ఆలోచనలకు అంతరాయం కల్గిస్తూ సెర్గిపౌలస్ పనివాడు లోపలికి వచ్చి మార్కుని చూస్తూ "ఫెర్గె వెళ్ళే ఓడ గంటలోపల బయలు దేరుతుంది. మిమ్ములను ఆయత్తమవ్వ మని పౌలుగారు చెప్పారు" అని అన్నాడు.

"బర్నబాగారు ఏమన్నాడు" అన్నాడు మార్కు. కొంచెం అసహనంగా ఆయన ఏమి అనలేదని ఆ నౌకరు బయటకు వెళ్ళిపోయాడు. మార్కుకు బహుదుఃఖము కల్గినది. ఇప్పుడు పెత్తనం పౌలుదై పోయింది. తన మామతో అయితే చనువుగా చెప్పుకోవచ్చు.ఇప్పుడు ఎలా? అనుకొంటు ఫెర్గె ప్రయాణం ఎంతదూరం అని అటుగా వెళ్తున్న ఒక పని వానిని ప్రశ్నించాడు. నూటడెభై మైళ్ళ నుండి రెండువందల మైళ్ళ వరకు ఉంటుంది అన్నాడు. అమ్మో! అంత దూరమా అని పెద్దగానే అన్నాడు. మళ్ళీ మనసులో అయినా తప్పేదేముంది అను కొన్నాడు. కాని అంత ధైర్యం ఏది? బర్‌యేసుని గద్దించే టప్పుడు పౌలు ముఖం తనకు ఇంకా గుర్తు ఉన్నది.

ఫెర్గె చాలా చిన్న రేవు. చేపలు పట్టుకొనే పడవలు మాత్రమే ప్రవేశించగలవు. కాని ఓడలు ప్రవేశించలేవు. బర్నబా ప్రయాణం చేస్తున్న ఓడ సముద్రంలో అరమైలు దూరంలోనే ఆపేశారు. అక్కడ నుండి చిన్న పడవలలో రేవు చేరవలసి ఉంది. పెద్ద ఓడలో నుండి చిన్న పడవలోకి దిగటం ప్రాణాంతకమే అయింది. మార్కు మనసులో వెనుకకు వెళ్ళి పోదామనే కోరిక అధికమవుతుంది. అదికాక సిసారియ వెళ్ళే ఓడ ఒకటి సముద్రంలో వేచి ఉండటం చూసాడు. తన తిరుగు ప్రయాణం గురించి చెప్పాడు. ఈ విషయంలో పౌలు అభ్యంతరం చెప్పాడు. **(సశేషం)**

# ఆల్బర్ట్
## (లియో టాల్‌స్టాయ్)

ఆమె పేరు అందరికి తెలుసు. నేను పేరు ఎందుకు చెప్పాలి? ఆమె చాలా ధనవంతురాలు, నేను చాలా బిద వాయిద్యగాడిని. ఆమె ఇంటికి ఆహ్వానించబడ్డాను. నేనెంత సంతోషించానో చెప్పలేను.

అలా నీవు ఆమె ఇంటికి చాలాసార్లు వెళ్ళావా? అన్నాడు డెలినోవ్. ఒక్కసారి వెళ్ళాను ఒక్కసారే! కాని నేను పిచ్చివాడ్ని చాలా బీదవాడిని.

నీవక్కడ ఏమి చేశావు? అన్నాడు డెలినోవ్.

అబ్బా! నేనేదీ చెప్పలేను అని తన ముఖాన్ని రెండు చేతులతో కప్పుకొని కొంచెంసేపు మౌనంగా ఉన్నాడు.

వాయిద్య బృందము గప్పపరు ఆ రోజు కొంచెం ఆలస్యంగా పెట్రోవ్‌తో కలిసి వచ్చాను. ఆమె తన బాక్సు చివర కూర్చుని ఉంది. ఆమెతో ఒక మిలటరీ అతను మాట్లాడుతున్నాడు. అతనెవరో నాకు తెలియదు. ఆమె తెల్లని డ్రస్‌లో ముత్యాలహారము పెట్టుకొని కూర్చుంది. అతనితో ఆమె మాట్లాడుతూనే నా వైపు చూచింది. అలా రెండుసార్లు చూచింది. ఆమె నన్ను గురించి అతనితో మాట్లాడుతుంది అనుకున్నాను. తరువాత నేను వాయిద్య బృందములో లేకుండా ఆమె ప్రక్కన బాక్సుపై కూర్చుని ఉన్నాను. ఇదెలా సాధ్యము? నేను చాలా బీదవాడని అన్నాడు ఆల్బర్ట్.

అదంతా నీ ఊహ మాత్రమే అన్నాడు డెలినోవ్.

కాదు, కాదు. ఆ విషయం నేనెలా చెప్పాలో నాకు తెలియడం లేదు. నేను ఆమె చేతిని ముద్దు పెట్టుకున్నాను. ఆమె ప్రక్కన నిలుచుండి ఏడ్చాను. ఆమెతో చాలా మాట్లాడాను. ఆమె వ్రాసుకున్న సెంటు గాలి పీల్చాను. ఒక్క రాత్రిలో ఆమె చాలా విషయాలు చెప్పింది. తర్వాత నా వయొలిన్‌తో చాలా పాటలు వాయించాను. నేను ఇది నమ్మలేకపోయాను. నాకు చాలా భయమేసింది. నేను నా తల విషయమే భయపడ్డాను. మరి మీరేమనుకుంటున్నారు? అన్నాడు ఆల్బర్టు.

ఇద్దరు కొంచెంసేపు నిశ్శబ్దంగా ఉన్నారు. ఆల్బర్టు వయొలిన్ కొంచెంసేపు వాయించి మళ్ళీ ప్రక్కన పెట్టి ఇప్పుడు నాతో వస్తావా? అన్నాడు.

ఎక్కడికి అన్నాడు డెలినోవ్.

అన్నా అవాన్నోవా వద్దకు. అక్కడ చాలామంది జనం ఉంటారు. సంతోషంగా ఉంటారు అన్నాడు ఆల్బర్టు

ఆ చోటికి వెళ్ళవద్దు అన్నాడు డెలినోవ్.

ఆల్బర్టు వయొలిన్ ప్రక్కన పెట్టేశాడు. నేను ఇక్కడే ఉండాలా? అని బల్లమీద చూశాడు. బ్రాందీ బల్లమీద లేదు. గదిలో నుండి బయటకు వెళ్ళిపోయాడు.

డెలినోవ్ జాకర్ వైపు చూస్తూ ఈ రాత్రి అతనిని ఎక్కడికి వెళ్ళనివ్వద్దు అని చెప్పాడు. మరునాడు సెలవు రోజున డెలినోవ్ సిద్ధపడి కాఫీ త్రాగి ఓ పుస్తకం చదువుతున్నాడు. ఆల్బర్టు ఎక్కడ ఉన్నాడో తెలియడం లేదు. జాకర్ జాగ్రత్తగా భోజనాల గది తలుపు శబ్దం కాకుండా తెరిచాడు.

మీరు నమ్ముతారా? అతను ఏ వస్త్రము పరచుకోకుండా సోఫాలో పడుకొని నిద్రపోతున్నాడు అన్నాడు.

మధ్యాహ్నానికల్లా దగ్గటం సకిలించటం వంటి శబ్దాలు వస్తున్నాయి. జాకర్ యొక్క దయగల స్వరము వింటున్నాడు.

ఏమిటి సంగతి అన్నాడు డెలినోవ్.

ఇక్కడ ఉన్నపోస్తుంది కాని ఆల్బర్టు లేచి ముఖమైనా కడుక్కోలేదు. మాటిమాటికి మందు అడుగుతున్నాడు అన్నాడు జాకర్.

ఇవ్వద్దు అని పుస్తకం చదువుకుంటూనే భోజనశాలలో ఆల్బర్టు ఏమి మాట్లాడుతాడో అని చెవులు అటు పెట్టాడు. రెండు గంటలు గడచిన తర్వాత గుడ్డలు మార్చుకొని ఆల్బర్టు ఉన్న చోటికి వచ్చాడు. ఆల్బర్టు కిటికీ మీద నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నాడు. డెలినోవ్ ఏమి అధైర్యపడలేదు. ఆల్బర్టు డెలినోవ్‌ను చూసి నవ్వబోయాడు కాని లాభం లేక పోయింది. లేచి భోంచెయ్యండి అన్నాడు డెలినోవ్.

వద్దండి వద్దు అన్నాడు ఆల్బర్టు.

మీరు కావాలంటే వయొలిన్ వాయించుకోండి అని

వయొలిన్ అతని దగ్గరగా పెట్టాడు. కాని ఆల్బర్టు తల త్రిప్పలేదు.

నేను చాలా బలహీనంగా ఉన్నాను. అసలు వాయించ లేను అన్నాడు.

డెలినోవ్ బయట వీధిలోకి వెళ్ళిపోయాడు. సాయం కాలం తిరిగి వచ్చిన తర్వాత నువ్వు భోంచేశావా అని ఆల్బర్టుని అడిగాడు. ఆల్బర్టు డెలినోవ్ వైపు నీరాశగా చూశాడు. నాటకశాల యజమానితో మీ విషయం ప్రస్తావిం చాను. ఆయన మిమ్మల్ని పనిలో పెట్టుకుంటానని చెప్పాడు. సంతోషంగా మిమ్మల్ని రమ్మన్నాడు అని చెప్పాడు అన్నాడు.

ఆల్బర్ట్ థ్యాంక్స్ అని, కాని వయొలిన్ వాయించేస్థితిలో లేను అని ప్రక్కన గదిలోకి వెళ్ళిపోయాడు. కొంసెంసేపట్లో ఆల్బర్టు వయొలిన్ చేత పట్టుకొని బయటకు వచ్చి వయొలిన్ కుర్చీలో పెట్టి మరలా మాయమైపోయాడు. అది చూచి డెలినోవ్ ఇంతకంటే నేనేమి చెయ్యగలను అన్నాడు.

ఆ రాత్రి కొంచెం ఆలస్యంగా ఇంట్లోకి వస్తూ ఆల్బర్ట్ ఎలా ఉన్నాడు? అని జాకర్‌ను అడిగాడు డెలినోవ్.

ఏమి బాగాలేదు. ఆల్బర్టు చాలా విసుగ్గా ఉండి రెండు మూడుసార్లు ఓడ్కా కావాలని అడిగాడు. విసుగుపుట్టి నేను ఒకసారి ఒక గ్లాసు ఇచ్చాను. అలా ఇవ్వకపోతే చస్తాడేమో అనిపించింది.

వయొలిన్ వాయించాడా? అని అడిగాడు డెలినోవ్.

లేదు అసలు వాయించలేదు. మీరు అతనికి డ్రింగ్ ఇవ్వొద్దన్నారుగా అన్నాడు జాకర్.

వద్దు, మరొకరోజు కనిపెడదాము, ఏమి జరుగుతుందో అప్పుడు అతను ఏమి చేస్తాడో? అన్నాడు.

తెల్లవారిన తర్వాత జాకర్ తన యజమాని దగ్గరకు వచ్చి రాత్రంతా అతను నిద్రపోలేదు. వంటగదిలోని వెళ్ళాడు. బీరువాలు తెరవాలని చూశాడు. అయితే అన్నిటికీ తాళాలు వేసివున్నాయి. జాకర్ నిద్రపోయినట్లు నడించానని, ఆల్బర్టు ఏదో పెద్ద పెద్దగా తనతో తాను మాట్లాడుకుంటు న్నాడని చెప్పాడు. సాయంకాలం డెలినోవ్ ఇంటికి వచ్చేటప్పటికి ఆల్బర్టు చాలా అసహనంగా ఉన్నాడు.

అయితే ఈ రాత్రి గడవనివ్వు రేపు ఉదయాన్నే అతనితో మాట్లాడతాను. నేను చెప్పినట్లు జీవిస్తానంటే ఇక్కడ ఉంచుకుంటాను. లేకపోతే వెళ్ళు అని చెప్తాను అని అను కొని, ఇంతకంటే ఎవరైనా ఏమి చెయ్యగలరు? అనుకుంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు. తన గదిలో పండుకొని ఇంతకంటే ఒక మనిషిని బాగుచెయ్యాలని అనుకొని ఒక దరిద్రుడ్ని నా ఇంటిలోకి తీసుకొచ్చి నా ముఖ్య స్నేహితులను ఇంటికి రాకుండా చేశాను అనుకున్నాడు. తనను తాను బాగుచేసుకోవడానికి అతను ఏమి ప్రయత్నాలు చెయ్యడం లేదు. అతని జీవితంలో గౌరవంగా గొప్పగా బ్రతకాలనే ఆశ లేనట్లున్నది. ఇలా ఆలోచిస్తూ వెంటనే ఆల్బర్టుని ఇంట్లో నుంచి పంపిం చెయ్యాలి అనుకున్నాడు. కాని రేపు చూద్దా ములే అని పండుకున్నాడు. దేవునికి తెలుసు నేను అతనికి ఎంత మేలు చెయ్యగలనో అని అనుకున్నాడు.

మధ్యరాత్రిలో ఏదో బీరువా హాలులో పడిపోయిన శబ్దం. ఇద్దరు పెద్దగా మాట్లాడుకుంటున్న శబ్దం.

అది విని లేచి ఓ క్యాండిల్ ముట్టించి వచ్చాడు. పెద్ద వాకిలికి అడ్డంగా జాకర్ నిలుచున్నాడు. ఆల్బర్ట్ ఏదో గొణుగుతున్నాడు. ఉండు యజమానిని పిలుస్తాను అంటు న్నాడు జాకర్.

నువ్వు ఆగు ముందు, నేనెక్కడికైనా, ఎలా అయినా వెళ్ళగలను. ఆ హక్కు నాకుంది. నన్ను మీరిక్కడ ఆపెయ్య లేరు అని ఆల్బర్టు అరుస్తున్నాడు. నేను పోలీసులకు ఈ సంగతి రిపోర్టు చేస్తాను అంటున్నాడు. డెలినోవ్‌ని చూసి జాకర్ తలుపుకు వీపు ఆనించి, రాత్రి నేను నిద్రపోయే టప్పుడు నా జేబులో నుండి తాళం తీసుకొని ఫుల్ బాటిల్ ఓడ్కా త్రాగి ఇప్పుడు బయటికి వెళ్తున్నాడు అన్నాడు.

నన్నెవరూ ఆపలేరు అని పెద్దగా అరుస్తున్నాడు ఆల్బర్ట్.

ఎందుకు అలా అరుస్తున్నావు? నిన్నెవరు ఇక్కడ ఆపరు అంటూ అడ్డుతొలగి నిలుచున్నాడు.

ఆల్బర్టు బయటకి వచ్చి గబగబ వెళ్ళిపోయాడు. ఇక అతనికితీ ఏమవుతుందో అన్నాడు జాకర్ డెలినోవ్‌తో.

డెలినోవ్ తల అడ్డంగా ఆడించాడు. గత రెండు సాయం కాల సమయాలలో ఆల్బర్టుతో గడిపిన సందర్భాలు జ్ఞాపకం చేసుకున్నాడు. అతను వాయిద్యం వాయించినప్పుడు జనులలో, ముఖ్యంగా తన హృదయంలో అతను రేపిన మధుర స్మృతులు గుర్తుకు వచ్చాయి. **(సశేషం)**

సాక్ష్యము

# చీకటి నుండి ఆశ్చర్యకమైన వెలుగులోనికి

నా పేరు షేక్ జాని. గుంటూరు నా యొక్క జన్మస్థలం. మా తల్లిదండ్రులకు నలుగురు కుమారులు. నలుగురు కుమార్తెలు. నేను రెండవ కుమారుడను. యౌవనప్రాయంలో ఉండగా మాయాబజార్‌లో మోటర్ మెకానిక్‌గా పనిచేస్తూ బాగా డబ్బు సంపాదించేవాడను. వృత్తిలో ఎలాంటి మోసాలు చేయడానికైనా వెనుకాడేవాడను కాను. విపరీతంగా బ్రాంది త్రాగేవాడను. వ్యభిచార దాహంతో రాత్రులు 12 గంటల తర్వాత వ్యభిచారగృహాలకు, క్లబ్బులకు వెళ్ళేవాడను. ఎంతో మంది స్త్రీల జీవితాలతో ఆట్లాడుకున్నాను. బహుకామాంధుడనై తిరిగాను. చర్చికి వెళ్ళే స్త్రీలతో సరసాలాడేవాడను. వారిపై చిన్న చిన్న రాళ్ళు విసిరేవాడను. త్రాగుడు, వ్యభిచారం, జూదం, పోకిరి చేష్టలు ఎన్నున్నప్పటికి సంవత్సరానికి ఒక సారైనా నల్గొండ జిల్లాలో ఉన్న జానపాటి సైదులు దర్గాకు మేకపోతులతో, పొట్టేళ్ళతో వెళ్ళి బలి నర్పించేవాడను. అక్కడ కార్యక్రమాలు ముగించుకొని తిరుగు ప్రయాణంలో బాగా త్రాగి బంధుమిత్రులతో కేరింతలు కొడుతూ ఇంటికి చేరేవాడను. నా కులమే గొప్పది, నా మతమే గొప్పది, నా భక్తి మార్గమే గొప్పదన్న దురభిమానం నాకుండేది. నేనెంతో పవిత్రుడనని విర్రవీగేవాడను. అందగాడిననే అహంకారం కూడా నాకుండేది. కులస్తులను బహుగా ప్రేమించేవాడను. కాని వారు ఏనాడైనా నా ప్రవర్తనను మార్చుకోమని నన్ను హెచ్చరించలేదు. మతాన్ని గురించి మాత్రమే చెప్పేవారు. క్రైస్తవులన్నా, క్రీస్తు అన్నా నాకెంతో అసహ్యంగా ఉండేది.

ఇలా జరుగుతున్న కాలంలో నేను క్రైస్తవుడనని చెప్పి గుంటూరుకు చెందిన ఎస్తేరు అనే అమ్మాయిని మోసం చేత వశం చేసికొన్నాను. ఆమెను తీసుకొనిపోయి ఒకచోట మకాం పెట్టాను. వారి బంధువులు ఈ విషయం తెలుసుకొని పోలీసులకు రిపోర్టు ఇవ్వగా పోలీసులు వచ్చి మా ఇద్దరిని రసూలు పేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకొని వెళ్ళారు. కొంతసేపైన తర్వాత యస్.ఐ. కోటిరెడ్డిగారు వచ్చారు. ఆయన చాలా భయంకరుడు. ఆయన నా దగ్గరకు వస్తూనే లాఠీ ఊపుతూ ఏరా! బాగా క్రొవ్వు పట్టిందా? నీ సంగతి చూస్తాను ". అంటూ ఆమె దగ్గరకు వెళ్ళి ఆమెను ప్రశ్నించాడు. అప్పుడు ఎస్తేరు, జానీ నన్ను బలవంతము చేయలేదు. నన్ను బలవంతముగా బంధించలేదు. మేమిద్దరము మేజరులం పెద్దవారము. నేనే ఇష్టపూర్వకంగా ఆయనతో వచ్చాను అని చెప్పింది. అప్పుడు పోలీసు ఇన్‌స్పెక్టర్ నన్ను ఏమి చేయలేదు. మమ్ములను ఇద్దరిని బయటకు పంపించి వేశాడు. ఎస్తేరు బంధువులు ఆమెను తిట్టి, నువ్వు అక్కడే అతనితో చావు అని చెప్పి వెళ్ళిపోయారు. నా స్నేహితులు, బంధువులు ఎస్తేరును వదలి రమ్మన్నారు. నేను ఎస్తేరును వెళ్ళిపో అన్నాను. కాని ఎస్తేరు నన్ను వదలలేదు. నా వెంట పడింది. నేను కాలితో తన్నాను. నీది నీచకులము నేను నవాబును పో అన్నాను. ఆమె నన్ను వదలలేదు. ఏడుస్తూ నా కాళ్ళను మెలివేసుకొంది.

ఇక నేను చేసేదిలేక ఆమెతో కాపురం ప్రారంభించాను. ఆమెను చాలా హింసించాను. అన్నీ భరించింది. తర్వాత కొంతకాలమునకు విశాఖపట్టణం స్టీలుప్లాంటు వద్ద నా వ్యాపారం ప్రారంభించాను. లక్షలు గడించాను. రోజు త్రాగి తిరిగి ఇంటికి వచ్చేవాడిని.

ఒకరోజు నేను మధ్యాహ్నం అలవాటు తప్పి ఇంటికి రాగా నా భార్య మరొక వ్యక్తితో కలిసి ఇంటిలో మోకరించి ప్రార్థిస్తున్నది. నాకు చాల కోపం వచ్చింది భర్త లేనప్పుడు పరాయి మగవానిని ఇంట్లోకి రప్పించినందుకు ఆమెను తిట్టి ఆ దైవజనునితో "మరియొకసారి నా ఇంట్లో కనబడ్డావంటే నీ కాళ్ళు విరగగొడ్తాను, జాగ్రత్త " అని హెచ్చరించాను. ఆ దైవజనుడు కన్నీటితో నా ఇంటి నుండి వెళ్ళిపోయాడు. ఎస్తేరు ఇంటిలో పెట్టిన యేసుప్రభు ఫోటోను కూడా బలవంతంగా తీయించాను. " ఫోటోలేవి కనపడకూడదు. పాస్టర్లు ఎవ్వరూ ఇంటికి రాకూడదు." అని ఆమెను గట్టిగా హెచ్చరిక చేశాను. ఇలా జరుగుతుండగా కొన్నాళ్ళకు నా పరిస్థితియంతా తారుమారైపోయింది. వర్క్‌షాపు బాగా నష్టాల్లో పడిపోయింది. హఠాత్తుగా అగాధంలో పడిపోయాను. అప్పులు బాగా పెరిగిపోయాయి. " నీ చెడుతనమును నీవు ఆధారము చేసికొని ఎవడును నన్ను చూడడని అనుకొంటివి. నేనున్నాను నేను తప్ప మరి ఎవరునూ లేరని నీవనుకొనునట్లుగా నీ విద్యయు నీ జ్ఞానమును నిన్ను చెరిపివేసేను" అన్న

వాక్యం (యెషయా 47:10) ప్రకారం నా యొక్క చెడుతనము నా అహంకారము నన్ను హీనస్థితికి లాక్కొని పోయాయి. తినడానికి తిండిలేదు. ఆదరించేవారు కరువయ్యారు. ఒక్క నాన్‌రొట్టె తెచ్చుకొని చెరిసగం తిని, నీళ్ళు త్రాగి పడుకునే స్థితికి దిగజారిపోయింది కుటుంబం. ఆ పరిస్థితిలో కూడా నా భార్య ప్రభువును నమ్ముకుందాం అని చెప్పగా "ఆ మాట మాత్రం చెప్పవద్దు" అంటూ అనేకసార్లు ఆమెపై మండిపడ్డాను.

అప్పుల వాళ్ళకు కనపడకుండా జేబుగుడ్డను అడ్డంపెట్టుకొని తిరిగాను. త్రాగిన మైకంలో అనేకసార్లు వస్త్రహీనుడనుగా బజార్ల వెంటపడిపోయాను. ఆ స్థితిలో ఎస్తేరు నన్ను వెదుక్కుంటూ వచ్చి ఇంటికి తీసుకొని వెళ్ళేది. నా దుస్థితిని పోగొట్టుకోవాలని అనేకమంది మాంత్రికులను, శకునగాళ్ళను ఆశ్రయించాను. గడియారం, ఉంగరాలు తాకట్టుపెట్టి కాకినాడ నుంచి మాంత్రికుని పిలిపించి వాని కాళ్ళకు మొక్కాను. అతడేవేవో నిమ్మకాయలు, కొబ్బరికాయలు మంత్రించి కట్టాడు. కాని పరిస్థితి బాగుపడకపోగా ఇంకా సమస్యలధికమయ్యాయి. కొందరు చెప్పిన సలహా మేరకు శనిగ్రహ పూజ చేయించాను. ఇంకా శని అధికమైంది ఆమె చేతులు దేవుని వైపు చూస్తుండగా నా చేతులు మంత్రగాళ్ళ వైపు, కులం వైపు, మతం వైపు చాపబడ్డాయి. ఒక్క దయ్యాల రెడ్డి అనే వ్యక్తికే ఆరు లక్షల రూపాయలు అప్పుబడ్డాను. అప్పుల బాధలు తట్టుకోలేక గుంటూరు వచ్చి ఆస్తిలో వాటా పంచి ఇమ్మని తల్లి నడిగాను. " కంఠంలో ప్రాణముండగా అది జరుగదు " అని నిర్దయగా చెప్పేసింది నా తల్లి. చెల్లిని ఆశ్రయించి నాకు రావలసిన డబ్బివ్వమని అడిగాను. ఆమె వీలుపడదన్నది. అన్న దగ్గరకు వెళ్ళాను. ఎవరి ద్వారా సహాయం దొరకలేదు. గాజువాకకు తిరిగి ప్రయాణమయ్యాను. బ్రతకడం వ్యర్థం, చనిపోవడం మేలనుకున్నాను. ఎప్పుడూ ఎ.సి. కంపార్టుమెంటులో ప్రయాణించే నేను పాసింజర్ బోగిలో ప్రయాణం చేస్తున్నాను. తిండిలేదు. ఆకలి బాధతో ఉన్నాను. లెట్రిన్‌కు సమీపంలో క్రింద కూర్చొని ఎవరైనా చూస్తే హేళన చేస్తారేమో అనుకొని రెండుకాళ్ళ సందులో తలకాయ పెట్టుకొని, లోలోన ఏడుస్తూ కన్నీరు కారుస్తున్నాను. ఇంతలో చిన్న కునుకుపట్టింది. ఎన్నడు లేని విధంగా ఒక దర్శనం కలిగింది.

ఒక బండమీద నిలబడి ప్రభువు తన గొఱ్ఱెలను కాస్తున్నాడు. లోయలో గొఱ్ఱెలు మేస్తున్నాయి. ఆయన చంకలో ఒక గొఱ్ఱెపిల్ల ఉన్నది. ఆయన నన్ను పిలిచి నాతో అంటున్నాడు. " నీ వెందుకు మార్గం కాని మార్గంలో వెళ్ళుచున్నావు? నేను– "అయ్యా అందరూ నన్ను మోసం చేశారు " అన్నాను. ఆయన మరలా నాతో "నీ డబ్బు నిన్ను ఆదరించలేదా? అన్నప్పుడు నేను "నా డబ్బు నన్ను విడచి ఎక్కడికో వెళ్ళిపోయిందయ్యా" అన్నాను. మరలా ఆయన నీ కులం నిన్ను ఆదుకోలేదా? అన్నప్పుడు నేను "నా కులం నన్ను నడిరోడ్డుపై వదిలి వేసింది" అన్నాను. అప్పుడు మరలా ఆయన నీ రక్తసంబంధులు నిన్ను చేరదీయలేదా? అన్నప్పుడు నేను "వారు నన్ను అప్పుల వాళ్ళకు అప్పగించారు" అన్నాను. అప్పుడు ఆయన నన్ను ఓదార్చుతూ "నా వైపు చూడు. నన్ను విశ్వసించు, సమస్తము నీకిస్తాను" అని చెప్పి ఆయన నిలుచున్న బండపై నన్నునూ నిలబెట్టి ఒక రొట్టెను తినిపించి, టెంకాయ చిప్పలోని ద్రాక్షారసం త్రాపించాడు. వెంటనే నాలోని చీకటి తొలగిపోయి కన్నులలోని అహంకారపు పొరలు రాలిపోయినట్లనిపించింది.

ఇంటికి వెళ్ళి నేను తీపించిన ఆ ఫోటో నాకు చూపించమని ఎస్తేరును అడిగాను. ఆమె భయపడి నాకివ్వలేదు. ఆ ఫోటో నాకివ్వకపోతే నేను చనిపోతాను. ఇక బ్రతకను అన్నాను. ఇస్తాను కాని ఎందుకో చెప్పు అని ఆమె అడగగా "ఈ రోజు ఫోటోలో ఉన్న రీతిగానే ప్రభువు నాకు దర్శనమిచ్చాడు" అన్నాను. ఆమె బోరున ఏడ్వడం ప్రారంభించింది. "నా ఖర్మకాలి నేనేడుస్తుంటే నీవెందుకే ఏడ్వడం అంటూ ప్రశ్నించగా "17 సంవత్సరాలుగా కన్నీళ్ళు విడచి ప్రార్థిస్తున్న నాకు కలగని దర్శనం నీకు కలిగిందా! అయ్యా! అంటూ ఇంకా ఏడ్వసాగింది. దుష్టులను, దుర్మార్గులను రక్షించడానికే ఆయన ఈ లోకానికి వచ్చాడని చెప్పి "నశించిన దానిని వెదకి రక్షించుటకే ఆయన ఈ లోకానికి వచ్చాడన్న వాక్యాన్ని (లూకా 19:10) కూడా చదివి వినిపించింది.

ఇది జరిగిన కొన్నాళ్ళకు దయ్యాలరెడ్డి మా ఇంటికి నేరుగా రానేవచ్చాడు. నేను నా భార్య ప్రార్థన చేసికొనుచుండగా వచ్చి నిలుచున్నాడు. పెద్దపులిని చూచినంత భయమేసింది నాకు. "నాకు నీవు 6 లక్షలు అసలు 1 లక్షా 20 వేలు వడ్డీ ఇవ్వాలి. కనీసం ఒక్కరూపాయి జమ లేదు. సమాధానం కూడా లేదు. రేపు నీవు 10 గంటలకు నా వద్ద ఉండాలి లేకపోతే ఏమి జరుగుతుందో బాగా ఆలోచించుకో " అంటూ కోపంతో వెళ్ళిపోయాడు. అతడు బహు కోపిష్టి, క్రూరుడు, ఋణం తీర్చేవరకు వదిలి పెట్టడు. బాగా కంగారు పడిపోయాను. వ్యధ చెందాను. రెండవరోజు ఉదయాన్నే నా

భార్య "నీవు వెళ్ళు, పరిస్థితి చెప్పు, నీవు తిరిగి వచ్చేంత వరకు నేను ప్రార్ధన చేస్తూనే ఉంటాను. ప్రభువు తప్పక సహాయం చేస్తాడు" అంటూ ధైర్యపరచి పంపేసింది. నేను వెళ్ళేసరికి 10 మంది మనుషులతో దయ్యాలరెడ్డిగారు ఉన్నాడు. వణుక్కుంటూ వెళ్ళి పిల్లిలా నిల్చున్నాను. డబ్బెందుకు కట్టలేదని నన్నడిగాడు. పరిస్థితి అంతా చెప్పి భోజనానికే ఇబ్బంది పడుతున్నానని దీనంగా చెప్పాను. కఠిన హృదయం కరిగిపోయింది. గుమస్తాను పిలిపించి 50 వేల రూపాయల చెక్కు నా పేర వ్రాయించి ఇచ్చి, ఈ డబ్బుతో మరలా పనిని ప్రారంభించు, ఎవరైనా నీకు బాధ కలిగిస్తే నాపేరు చెప్పు వెళ్ళు" అని చెప్పి పంపించాడు.

ప్రియమైన దేవుని బిడ్డలారా! సహోదరి సహోదరులారా ప్రభువు ఎంత ఆశ్చర్యకరుడో చూడండి. అసాధ్యం అనుకున్న వాటిని ఆయన సుసాధ్యం చేస్తాడు. ఇంటికి వెళ్ళాను. క్రమంగా బైబిల్ చదవడం ప్రార్ధన చేయడం ప్రారంభించాను. ఒకనాడు కాళ్ళు విరగగొడ్తానని నేను హెచ్చరించిన ఆ దైవజనుని మందిరానికి నేను నా భార్య కలసి వెళ్ళాము. ఆయన మమ్ములను చూచి కన్నీరు కార్చడం ప్రారంభించాడు. నేను "మీరు ఎందుకు కన్నీరు కారుస్తున్నారు? నన్ను క్షమించండి. మిమ్ములను బాధపెట్టినందుకు" అన్నాను. ఆయన "ఇవి కన్నీళ్ళు కావయ్యా! ఆనంద భాష్పాలు. ప్రభువు నా ప్రార్ధన ఆలకించి నీ మనసు మార్చాడయ్యా! ఈ సంతోషాన్ని భరించలేకపోతున్నానయ్యా"! అన్నాడు. ఆ తర్వాత సంఘంతో కూడి ఆయన నా షాపుకు వచ్చి నిమ్మకాయలు, టెంకాయలు అన్ని తొలగించి బక్కెట్ నీళ్ళలో ప్రార్ధించిన కొబ్బరినూనె (యేసు రక్తమును) కలిపి నాలుగు మూలలు చల్లాడు. ఆ తర్వాత సంఘమంతా కన్నీటితో ప్రార్ధన చేస్తుండగా నాకు కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి. వీరెవరు? నా బంధువులా?, నా రక్త సంబంధులా?, నా కులం వాళ్ళా? లేక నా మతం వాళ్ళా? నా కోసం ఎందుకు ఇంతగా ఏడుస్తూ ప్రార్ధిస్తున్నారు? అంటూ ఆశ్చర్యంలో మునిగిపోయాను. ఒక సంవత్సరము 4 నెలలు తిరగక ముందే 6 లక్షల రూపాయల బకాయి తీర్చగలిగాను. ప్రభువు దర్శించిననాడే నాలోని వ్యసనాలన్ని దూరమైపోయాయి. ఆ దైవజనుని ద్వారా (ఇమ్మానియేలు గారు) రక్షణ పొందాను. నా పేరు జాన్సన్‌గా మార్చబడినది.

ప్రియులారా! ఒకనాటి కామాంధుడనైన నాకు కళ్ళు తెరిపింపచేసి ఆయన దర్శనభాగ్యం నాకు ప్రసాదించాడు. ఎంతోమంది ఆత్మీయ సహోదరీ సహోదరులను తల్లిదండ్రులను నాకిచ్చాడు. కడుపునిండా కూటికి నోచుకొని నన్ను ఎంతో మంది కడుపు బాధ తీర్చేవానిగా చేశాడు. కులమతాల కట్ల నుండి నన్ను విడిపించి సర్వ స్వతంత్రునిగా చేశాడు. ప్రస్తుతం నేను పొందుతున్న రక్షణానందము వర్ణించలేను. అది పొందిన వారికే అర్ధమవుతుంది. భయము, చింత, దిగులు నాదరికే ఆయన రానివ్వడు. దూర సుదూర ప్రాంతాలకు వెళ్ళి నా రక్షకుడైన క్రీస్తు నా జీవితంలో చేసిన కార్యాలను వేలమంది ఎదుట సాక్ష్యం ద్వారా తెలియచేస్తున్నాను. సదా నా కొరకు ఆత్మీయ సహోదరులెల్లరు ప్రార్ధిస్తారని ఆశిస్తున్నాను. గాజువాక నుండి వచ్చి ప్రస్తుతం గుంటూరులో స్థిరపడిపోయాను.

నా ప్రియ సహోదరీమణులారా! మీరు కూడా నా వంటి మూర్ఖులను భర్తలుగా కలిగి ఉంటే మీ భర్తల కొరకు అలయక ప్రార్థించవలసినదిగా మనవి చేసికొంటున్నాను. నన్ను విడిపించిన నిజమైన దేవుడు ప్రభువైన యేసుక్రీస్తు మిమ్ములను కూడ విడిపించి రక్షించును గాక! మీ ప్రియ సహోదరుడు

**షేక్ జాన్సన్ (జాని)**


## రూ. 25,000 క్రిస్మస్ కానుక

**బహుమతుల వివరములు**

రూ. 5000/- అంతకు పైన కట్టిన వారిలో 5గురికి రూ.3000/-లు విలువగల బహుమతి

రూ. 3000/- (జీవితచందా) కట్టిన వారిలో 5 గురికి రూ.1500/-లు విలువగల బహుమతి

రూ. 1000/- నుండి 3,000 వరకు కట్టిన వారిలో 5 గురికి 500/- విలువగల బహుమతి

రూ. 500/- నుండి 1000/- కట్టిన వారిలో 5 గురికి 300/- విలువగల బహుమతి


రూ. 500/- నుండి 150/- పైన కట్టిన వారిలో 5 గురికి 150/- విలువగల బహుమతి

రూ. 150/- (సంవత్సర చందాదారులలో) 10 మందికి 100/- విలువగల బహుమతి

మీ చందాను డిసెంబర్ 20 లోపు పంపించి మీ సీరియల్ నంబర్ రిజిష్టర్ చేసుకోండి

**బహుమతులను లక్కిడిప్ ద్వారా ఎంపిక చేసి, వారు పొందిన బహుమతి మొత్తమును బైబిల్స్, క్రైస్తవ పుస్తకములుగా పోస్ట్ ద్వారా పంపడం జరుగుతుంది.**

5



# బైబిలు ప్రాముఖ్యత

## (Importance of the Bible)

**సేకరణ: రెవ.డా॥ కె.జోసఫ్**

టెలిస్కోపు కనిపెట్టబడకముందు కొన్ని వందల, వేల నక్షత్రాలు అనుకొనేవారు. అయితే ఈ మధ్య కాలములోనే కొన్ని వందల లక్షల నక్షత్రాలున్నాయని, ఆ తర్వాత లెక్కపెట్టలేనన్ని కోట్ల కోట్ల నక్షత్రాలున్నాయని చెప్తున్నారు. అయితే ఆదికాండము 15:5వ వచనములో యెహోవా దేవుడు అబ్రహాముతో ***"నక్షత్రములను లెక్కించుటకు నీచేతనైతే లెక్కించుము అని చెప్పి, నీ సంతానము అలాగవునని చెప్పెను".*** యిర్మియా 33:22లో యెహోవా యిర్మియాకు ప్రత్యక్షమై "ఆకాశ నక్షత్రములను లెక్కింప శక్యము కానట్టుగాను, సముద్రపు ఇసుక రేణువుల నెంచుట అసాధ్యమైనట్టుగాను..." మనం చూస్తాము.

చాలాకాలం క్రితం వరకు విజ్ఞాన ప్రపంచమునకు నక్షత్రములు లెక్కకు మించినవని అవి కొన్ని వందల వేల గెలాక్సీలలో వందల వేలకు మించినవని తెలియదు. అయితే పరిశుద్ధ గ్రంథమునకు తెలుసు ఎందుకంటే దాని కర్త యెహోవా దేవుడు కనుక. యోబు 38,39 అధ్యాయాలలో యెహోవా దేవుడు యోబును అనేక ప్రశ్నలడుగుచు వాటిలో విద్యుత్ తరంగ ములను గూర్చి మాట్లాడుచున్నాడు. రేడియోను గురించి యోబుకు తెలియదు అయితే యెహోవా దేవుడు "మెరుపులు బయలు వెళ్ళి.... చిత్తము ఉన్నామని నీతో చెప్పునట్లు నీవు వాటిని బయటకు రప్పింపగలవా? అని రేడియో తరంగములను గూర్చి మాట్లాడినట్లు బైబిల్‌లో లిఖించబడినది.

భూమిలో ప్రతి వంద అడుగుల లోతుకి ఒక డిగ్రీ వేడి పెరుగుతుంది. ఈ మధ్యకాలములో విజ్ఞానశాస్త్రము 50 మైళ్ళ లోతు తర్వాత తట్టుకోలేని వేడి పుడుతుంది అని చెపుతుంది. అయితే పరిశుద్ధ గ్రంథములో ***"భూమి నుండి ఆహారము పుట్టును. దాని లోపలి భాగము అగ్నిమయమైనట్లుండును"*** (యోబు 28:5) అని వ్రాయబడినది. అంత్యదినములలో ఇద్దరు దైవసాక్షులను జయించిన అంత్యక్రీస్తు తన జయ చిహ్నముగా మూడు దినములున్నర ఆ ఇద్దరి శవములను సమాధి చేయక సంత వీధులలో పడవేయగా ప్రజలకును, వంశములకును, ఆయా భాషలు మాటలాడు వారికిని, జనములకును సంబధించిన వారు ఆ మూడు దినములున్నర వారి శవములను చూచుచూ, అంటే భూనివాసులందరు చూస్తారని ఎలా? ఉపగ్రహముల ద్వారా, టి.విలలో చూస్తారని టెలివిజన్ యొక్క ఆవిర్భావాన్ని ముందుగానే ప్రవచింపబడినది.

ఇంతవరకు మనము చరిత్ర, విజ్ఞానశాస్త్రములు వేద వాక్యము నిజమైనదిగా, నమ్మదగినదిగా చెప్పుట గమనించి యున్నాము. ఇంకా, నెరవేరిన ప్రవచనములు బైబిలును సత్యవేదముగా నిరూపించుట చూద్దాం. దానియేలు గ్రంథము 2వ అధ్యాయములో కల్దీయుల రాజగు నెబుకద్నెజరునకు కలిగిన స్వప్నమును గమనిస్తే అందు ఒక బ్రహ్మాండమైన ప్రతిమ మహా ప్రకాశమును భయంకరమైన రూపమును గలదై కనిపించెను. దాని శిరస్సు మేలిమి బంగారు మయమైయుండెను. ఇది బబులోను రాజ్యమును సూచించుచున్నది. దాని రొమ్మును, భుజములును వెండివి. ఈ భాగము పర్షియా రాజ్యమును సూచించుచున్నది. ఈ ప్రతిమ ఉదరము, తొడలు ఇత్తడివి. ఈ భాగము గ్రీకు రాజ్యమును సూచించుచున్నది. మోకాళ్ళు ఇనుపవియు, పాదములలో ఒకటి ఇనుపదియు, ఒకటి మట్టిదియు అయి ఉన్నవి. ఈ ఇనుప కాళ్ళు రోమా సామ్రాజ్యమును, రెండు పాదములు రోమా సామ్రాజ్యము రెండు భాగములుగా విడిపోవుటను సూచించుచున్నది. ఇదే అధ్యాయము 44వ వచనంలో "పరలోకరాజ్యమందున్న దేవుడు ఒక రాజ్యమును స్థాపించును దానికెన్నటికిని నాశనము కలుగదు.... అది యుగయుగముల వరకు నిలుచును" అన్న ప్రవచనము

జరగబోవు దేవుని రాజ్య స్థాపనను సూచించుచున్నది.

అలాగే యెహెజ్కేలు 26:3-5 - క్రీస్తుకు పూర్వము 4,5 శతాబ్దములలో తూరు పట్టణము చాలా గొప్పది. ఇక్కడి ప్రజలు సముద్ర వ్యాపారములు చేసి విస్తారముగా ధనమార్జించిరి. చాలా ధన సంపాదనగల దేశము గనుక పట్టణము చుట్టూ ఒక గట్టి గోడ నిర్మించుకొన్నారు. ఈ పట్టణంలో ఎంత ధనము ఉన్నదో అంత పాపభూయిష్టమైనది. అందుకే ప్రభువు వాక్కు యెహెజ్కేలు ద్వారా ప్రవచించబడినది ఏమనగా, "తూరు పట్టణమా, నేను నీకు విరోధినైతిని, సముద్రము దాని తరంగములను పొంగజేయు రీతిగా నేను అనేక జనములను నీమీదికి రప్పించెదను. వారు వచ్చి తూరు యొక్క ప్రాకారములను, కోటగోడలను కూల్చి పడ గొట్టెదరు. నేను దాని మీదనున్న మంటిని తుడిచి వేసెదను. దానిని వట్టి బండగా చేసెదను..." ఇంకా 12-14 వచనములలో "వారు నీ ఐశ్వర్యమును దోచుకొందురు, నీ వర్తకమును అపహసించెదరు.... నిన్ను వట్టి బండగా చేతును, వలలు పరచుకొనుటకు చోటగుదువు. నీవు ఇక కట్టబడకయుందువు". ఈ ప్రవచనము నెరవేరునట్లు నెబుకద్నెజరు తూరు యొక్క ప్రాకారములను, కోట గోడలను పటగొట్టి దానిని వశపరచు కొన్నాడు. అయితే ఈలోపే ప్రజలు తమ ఐశ్వర్యమును, కలప, రాళ్ళు మొదలగు వాటిని తూరు పట్టణము నుండి ఒక కిలోమీటరు పడమరకు సముద్రములోనున్న ఎత్తైన ప్రదేశమునకు దాటవేసిరి. ఈ విధముగా ప్రవచన సగభాగము నెరవేరినది. సరిగ్గా 200 సంవత్సరములైన తర్వాత గ్రీసు దేశస్థుడైన అలగ్జాండరు తూరు దేశమును లొంగిపొమ్మని కబురు పంపగా వారు దానికి అంగీకరించలేదు. అప్పుడు అలెగ్జాండరు సముద్రములోని ఆ ఎత్తైన ప్రాంతమునకు క్రొత్తగా ఒకదారి నిర్మించుకొని సైన్యంతో లోనికి ప్రవేశించి సమస్త ఆస్తులను, కలపను, రాళ్ళను సముద్రములో ముంచివేసెను. ఇప్పుడు ప్రవచన నెరవేర్పుగా ధ్వంసము కాబడిన పట్టణము తిరిగి కట్టబడలేదు. మత్స్యకారులు ఆ శిథిల పట్టణము దగ్గర తమ వలలను ఆరవేసుకొనుచున్నారు.

తూరు పట్టణమునకు ఉత్తరమున మరియొక పురాతనమైన సీదోను అను పట్టణము ఉంది. యెహెజ్కేలు 28వ అధ్యాయములోని ప్రవచనము సీదోను పట్టణము పూర్తిగా నాశనమగునని లేదు. అయితే తెగులు, రక్తపాతము జరుగునని ప్రవచింపబడెను. అలాగే అనేకమార్లు ఈ పట్టణము నకు జరిగినను అది ఇప్పటికి నిలిచియున్నది.

యూదులను గురించిన ప్రవచనము ఇలా ఉంది "మీకు మేలు చేయుచూ మిమ్మును విస్తరింప జేయుటకు మీ దేవుడైన యెహోవా మీయందు ఎలా సంతోషించెనో అట్లు మిమ్మును నశింపజేయుటకును మిమ్ము సంహరించుటకును యెహోవా సంతోషించును గనుక నీవు స్వాధీన పరచుకొనుటకు ప్రవేశించుచున్న దేశములో నుండి పెల్లగింపబడుదువు. దేశముయొక్క ఈ కొన మొదలుకొని ఆ కొన వరకును సమస్త జనములలోనికి యెహోవా నిన్ను చెదరగొట్టును... ఆ జనములలో నీకు నెమ్మది కలుగదు. నీ అరికాలికి విశ్రాంతి కలుగదు" ద్వితీయో. 28:63-65. ఈ ప్రవచనము అస్సీరీయులు బబులోనుకు ఇశ్రాయేలీయులను చెరగొనిపోబడుట ద్వారా, చివరిగా క్రీ॥శ॥ 70 సం॥లో రోమనుల ద్వారా యెరూషలేము పతనం కాబడినది. చరిత్ర కారుడైన జోసెఫస్ ఏమంటాడంటే క్రీ॥శ॥ మొదటి శతాబ్దంలో యూదులు లేని దేశము ప్రపంచంలో ఏది లేదట. యూదులను గురించి యెహెజ్కేలు 36వ అధ్యాయాలలో ఈ విధంగా ఉంది. "నేను అన్యజనులలో నుండి మిమ్మును తోడుకొని, ఆయా దేశములలో నుండి సమకూర్చి, మీ స్వదేశములలోనికి మిమ్మును రప్పించెదను ... నేను మీ పితురులకిచ్చిన దేశములో మీరు నివసించెదరు, మీరు నా జనులై యుందురు. నేను మీ దేవుడనై యుందును... మీ దోషముల వలన మీకు కలిగిన అపవిత్రతను తీసివేసి మీ పట్టణములలో మిమ్మును నివసింప చేయునాడు పాడైపోయిన స్థలములు మరల కట్టబడును. మార్గస్థుల దృష్టికి పాడుగాను, నిర్జనముగాను అగుపడిన భూమి సేద్యము చేయబడును. పాడైన భూమి ఏదెను వనమువలె ఆయెననియు జనులు చెప్పుదురు. అప్పుడు యెహోవానైన నేను పాడైపోయిన స్థలములను కట్టువాడ ననియు, పాడైపోయిన స్థలములలో చెట్లను నాటువాడననియు మీ చుట్టు శేషించిన అన్యజనులు తెలిసికొందురు. యెహోవానైన నేను మాట యిచ్చియున్నాను. నేను దాని నెరవేర్తును" యెహెజ్కేలు 36:26-28,33-36. అందుకే యేసుక్రీస్తువారి ఆరోహణ సమయంలో తన శిష్యులు "ప్రభువా, ఈ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరలా అనుగ్రహించెదవా?" (అపో.కా. 1:6) అని అడిగారు.

# రెండు కాసులు...

"ఆయన (యేసు) కానుక పెట్టె యెదుట కూర్చుండి, జనసమూహము ఆ కానుకపెట్టెలో డబ్బులు వేయుట చూచు చుండెను. ధనవంతులైన వారనేకులు అందులో విశేషముగా సొమ్ము వేయుచుండిరి. ఒక బీద విధవరాలు వచ్చి **రెండు కాసులు** వేయగా ఆయన తన శిష్యులను పిలిచి- కానుక పెట్టెలో డబ్బులు వేసిన వారందరికంటె ఈ బీద విధవరాలు ఎక్కువ వేసెనని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. వారం దరు తమకు కలిగిన సమృద్ధిలో నుండి వేసిరిగాని, యీమె తన లేమిలో తనకు కలిగిన దంతయు, అనగా తన జీవన మంతయు వేసెనని చెప్పెను" మార్కు 12:41-44.

యేసుప్రభువు చూస్తున్నాడు. కానుకల పెట్టె యెదురుగా కూర్చుని చూస్తున్నాడు. ఎవరు ఎంత వేస్తున్నారో చూస్తు న్నాడు. ఎవరి హృదయం ఎలా ఉందో గమనిస్తున్నాడు. కాని ఆ పేద విధవరాలికి తెలీదు యేసు తనని గమనిస్తు న్నాడని. అక్కడ చాలామంది గొప్పవాళ్ళు ఉన్నారు. తమ హోదాకి తగ్గట్టుగా, తమ పేరు మారుమ్రోగాలన్నట్లుగా వేలకొలది రూపాయలు ఇస్తున్నారు. వారికి డబ్బు మూలిగి పోతుంది. వారు ఘనత కోసం ఇస్తున్నారు. దేవున్ని ప్రేమించి ఇవ్వడంలేదు. ఇచ్చినందువల్ల వాళ్ళ ఆస్తి ఏమి తరగటం లేదు. వారికి కావలసింది ఘనత. కానీ పేద విధవరాలికి ఏమి ఘనత వుంటుంది. ముష్ఠి రెండు కాసులు వేస్తే ఎవరు మెచ్చుకుంటారు. ఇంకా చీత్కరించుకుంటారు. ఎవరైనా చూస్తారేమో అనుకుంటూ ఎవరి కంటా పడకుండా వెయ్యాలనుకుందేమో. కాని యేసుప్రభువు చూసేశాడు. యేసుప్రభువు చూసింది రెండు కాసులను కాదు, రెండు కాసులు వేసిన ఆమె హృదయాన్ని. ధనవంతులు అందరూ తమకున్న దాంట్లో నుండి 0.01% కూడా ఇచ్చి వుండరు. కాని ఆ విధవరాలు తన పేదరికంలో కూడా దేవునికి తనకున్నదంతా 100% ఇచ్చేసింది. అంటే తన జీవన మంతయు ఇచ్చివేసిన గొప్ప విశ్వాసి ఆ పేద విధవరాలు. తనకు దేవుడు ఇస్తాడన్న గొప్ప విశ్వాసం ఆమెది.


కాని, పెద్ద మొత్తాలలో వేస్తున్న ధనవంతులైన వారికి ఆ విధవరాలికున్న విశ్వాసం లేదు. కయీనులాగా దేవునికి ఇవ్వాలన్న ఆసక్తి లేదు. ఏదో మొక్కుబడిగా, పదిమంది ముందు ఘనతకోసం ఇచ్చేవారు తమ జీవనమంతా ఎందుకు ఇస్తారు? ధనవంతులు డబ్బును ప్రేమిస్తారు కాబట్టి దేవుడంటే విశ్వాసం వుండదు. "ధనాపేక్ష సమస్త మైన కీడులకు మూలము. కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి..." (1తిమో. 6:10). కాబట్టి ధనాపేక్ష ఉండే వాళ్ళకి విశ్వాసం ఉండదు, ఉన్నా దాని నుండి తొలగిపోతా రని బైబిల్ చెప్తుంది. పేద విధవరాలుకి దేవునియందలి విశ్వాసము అపారము. దేవుడు తనకు తిరిగి ఇస్తాడని విశ్వసించింది. "విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము. దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నా డనియు, తన్ను వెదకు వారికి ఫలము దయచేయు వాడనియు నమ్మవలెను గదా." (హెబ్రీ. 11:6). కాబట్టి దేవుడు ఫలము దయచేస్తాడని నమ్మిన వారు దేవునికి, దేవుని పనికి ఇవ్వడానికి ఏ మాత్రం వెనుకాడరు. సారెపతులోని విధవరాలు కూడా దేవుడిని నమ్మి, ఆయన అద్భుతకార్యములు చేయుటకు సమర్థుడు అని విశ్వసించి తన లేమిలో నుండి ఏలియాకు ఇచ్చింది. ఆమెకు ఇచ్చే హృదయం ఉందని దేవుడికి తెలుసు కాబట్టే ఏలియాను ఆమె దగ్గరకు పంపించాడు.

ప్రియ సహోదరా, సహోదరీ, దేవుని పట్ల మన హృదయం ఎలా స్పందిస్తుంది. లేమిలో దేవునికి ఇచ్చే హృదయం నీకుందా? ఇచ్చే కొంచెమైనా సంతోషంగా ఇస్తున్నావా? దేవుడు మనల్ని చూస్తున్నాడని మనం గుర్తుంచుకోవాలి.

**పాఠకులకు విజ్ఞప్తి. గత కొన్ని నెలలుగా చందా విషయం గుర్తు చేస్తూనే ఉన్నాము. అయినా సరే, కొన్ని సంవత్సరాలుగా పత్రిక పొందుతున్న వారు ఒక్కసారి కూడా చందాపంపలేదు. అయినా మేము ఆపలేదు. 150 రూపాయలు లేక పంపలేదని మేము భావించటం లేదు. బహుశా వారికి ఇచ్చే హృదయం లేదేమో. అయితే దేవుడు చూస్తున్నాడని మనం గుర్తుంచుకోవాలి. చందా కడతాము పత్రిక పంపండి అన్న వారికి పంపలేక, చందా కట్టక పోయినా పత్రిక పంపడం ఆపలేక దేవునికే వదిలేస్తున్నాము. కాబట్టి సహృదయముతో అర్థం చేసుకొని చందా కట్టండి**

6

# ఏడు సంఘాలు



బ్రదర్ కె.సామ్రాట్

## తుయతైర సంఘము

**(దుర్నీతితో నిండిన సంఘము. ప్రకటన 2:18-29)**

**గద్దింపు :** మారుమనస్సు పొందుటకు దానికి నేను సమయ మిచ్చితిని గానీ అది తన జారత్వము విడిచిపెట్టి మారుమనస్సు పొందనొల్లదు (21వ.). ప్రియులారా! ఈ రోమన్ కథోలిక్ సంఘము మారుమనస్సు పొందనొల్లదు. నేను మారనంటే మారనని భీష్మించుకుని కూర్చుంది. సమయము లేకనా? ఉంది. సరైన కాలంలో ఓపిగ్గా వెదకాలి సుమా. తీరిగ్గా ఉన్నప్పుడుకాదు. దేవుడు రమ్మని పిలిచినపుడే రావాలి. ప్రభువు మనల్ని సమీపించి మనతో మాట్లాడే సమయమే ఆయన్ని వెదకటానికి, రక్షణ పొందటానికి సరైన సమయం. దేవుని వైపు తిరగటానికి తయతైర నిరాకరిస్తుంది. జారత్వము విడిచిపెట్టి మారు మనస్సు పొందనొల్లదు. "తమ క్రియచేత అభ్యంతరపరచ బడినవారై వారు తమ దేవుని యొద్దకు తిరిగి రాలేక పోవుదురు. వారిలో వ్యభిచార మనస్సుండుట వలన వారు యెహోవాను యెరుగక యుందురు" (హోషేయ 5:4). పాపం చేస్తున్నామన్న గ్రహింపే లేకుండా పోయింది. యేసు ప్రభువు హెచ్చరించినట్లు (యోహాను 8:34) పాపపు సంకెళ్ళలోనున్న వారికి విడుదల పొందే మానసిక స్థైర్యం లోపించింది. దుష్ప్రవర్తన మానాలనిపించంచటం లేదు. దేవుని ప్రేమ వారి మార్పుకై ఎదురుచూస్తున్నా, తుయతైర లోని, యెజెబెలు ప్రతిస్పందించటం లేదు. అనేకులు నేడు యిలాంటి వైఖరినే కలిగియున్నారు. మనఃస్ఫూర్తిగా దేవునికి విధేయులై జీవించాలని ఆశలేదు. ఆశ ఉన్నా వ్యభిచార మనస్సు వారిని త్రోవ తప్పించి వేస్తుంది (హోషేయ 5:12). విశ్వాసులారా! మన గత జీవితపు పాపాల్నుండి తెగతెంపులు చేసుకొని, సిలువలో వెల్లడైన దేవుని ప్రేమనొకసారి గుర్తించి, పాపంతోనిక జోలి ఏమి? అని ధృఢ నిశ్చయం చేసుకుంటే ఎంత క్షేమం? అరకొర మనస్సుతో కాక, మాటలు సిద్ధపరచు కొని యెహోవా యొద్దకు వస్తే, ఆయన నమ్మదగిన వాడు, పాపాల్ని క్షమిస్తాడు (1యోహాను 1:9).

మారుమనస్సు పొందటం లేదు గనుక "ఇదిగో నేను దానిని మంచము పట్టించి, దానితో కూడా వ్యభిచరించు వారు దాని క్రియల విషయమై మారుమనస్సు పొందితేనే గాని వారిని బహు శ్రమలపాలు చేతును" (22వ.) వారు విసర్జించారు. గనుక వారికి శ్రమ కలుగును. నాశనము తప్పదు. తిరుగుబాటు ధోరణి నాశనమే (సామె.29:11). యెజెబెలు బోధలు అనుసరించే వారిని శ్రమల పాలు చేస్తాడు. తమ దోషాలచేత దేవున్ని విసికించి, ఆయాస పెట్టేశారు (యెషయా 43:24). శిక్షా దినాలు వచ్చేశాయి. యెజెబెలు చేసిన విస్తారమైన దోషం నిమిత్తం మంచం పట్టక తప్పదు. ఒకప్పుడు మెత్తటి శయ్యల మీద అటు ఇటు దొర్లుతూ, తాగి తందనాలాడి, కాముకులారై విశేషముగా వ్యభిచరించింది. ఘనమైన మంచం మీద కూర్చుంది (యెహె.23:41). ఇప్పుడు మంచం పట్టింది. అది ఎంత భయంకరం? ప్రభువు నీలాగు ప్రశ్నిస్తున్నాడు. "నేను నీకు శిక్ష విధించబోవు కాలమున ఓర్చుకొనుటకు చాలినంత ధైర్యము నీ హృదయమునకు కలదా? సహించు నంత బలము నీకుండునా?" (యెహె. 22:14). కావున మంచం పట్టాక వారు కేకలు వేస్తారు "శయ్యల మీద పరుండి కేకలు వేయుదురు" (హోషేయ 7:14). దానితో ఏకీభవించి వారు శ్రమల పాలవక తప్పదు. "దాని పిల్లలను నిశ్చయముగా చంపెదను (ప్రకటన 2:23).

దాని పాపము యొక్క తీవ్రత పిల్లల ఒడిలోకి వచ్చింది. మృత్యుఛాయ స్వైర్య విహారం చేస్తుంది. పాపం యొక్క పరిణామం చాలా తీవ్రమైనది. దేవుణ్ణి – మానవుణ్ణి వేరు చేస్తది. "పాపము వలన వచ్చు జీతం మరణం" (రోమా 6:23).

కావున "అంతరింద్రియములను, హృదయములను పరీక్షించువాడను నేనే అని సంఘములన్నియు తెలుసు కొనును" (23వ). మనుష్యులు పై రూపాన్ని లక్ష్యపెడ్తారు "యెహోవా హృదయమును లక్ష్యపెట్టును" (1సమూ. 16:7) మనుష్యుల్ని మోసం చెయొచ్చుగాని దేవుణ్ణి మోసం చేయ లేము. లోకంలో చాలామంది వైద్యులున్నారు. మానసిక వైద్యులున్నారు, గాని ఎవరూ అంతరింద్రియములను పరి శీలించువారు లేరు. దావీదు ప్రార్ధనలో "హృదయము లను అంతరింద్రియములను పరిశీలించు నీతిగల దేవా" (కీర్తన 7:9) అని సంబోధిస్తాడు. "నా అంతరింద్రియములను నా హృదయమును పరిశోధించుము" (కీర్తన 26:2) అని వేడు కోవటం చూస్తాం గనుక హృదయములో దేవునికి చోటిచ్చిన వారే విశ్వాసులు. సంఘములో దేవునికి చోటిచ్చినదే నిజ మైన సంఘము. సంఘము ఆయన్ని వశపరచుకో నివ్వాలి. ఏ సంఘము ఎలా ఆయన్ని ప్రేమిస్తుందో, ఆరాధిస్తుందో ఆయన తేటగా చూస్తున్నాడు. నీ రహస్య పాపాలు ఆయనకి మరుగైయుండవు. ఈనాటికైనా ఈ సంగతి గుర్తించు. నీవు నోటితో ఎంతో ప్రేమను కనపరచవచ్చు. ఒకవేళ నీ హృద యము లాభమును, (పాపమును) ఆశించుచున్నదేమో? (యెహె. 33:31). "సైన్యములకధిపతియగు యెహోవా, నీతిమంతులను పరిశోధించువాడవు నీవే, అంతరింద్రియ ములను, హృదయములను చూచువాడవు నీవే" (యిర్మీయా 20:12). ప్రియ సంఘమా! నీ హృదయము దేవుని యెదుట నిష్కళంకముగా ఉన్నదా? అయితే నీవు ధన్యుడవే. ఇతర సంఘాల్లో ఉన్న వారందరికి హెచ్చరికగా ఈ మాటలు చెబు తున్నాడు. అందరికీ వర్తించేలా పరిశుద్ధాత్మ దేవుడు సందేశ మిస్తున్నాడు, అంతేకాక ప్రతివానికి వాని వాని క్రియల చొప్పున ప్రతిఫలము యివ్వబడుతుంది. పక్ష పాతము లేకుండా వ్యక్తిగతంగాను, సంఘపరంగాను ఆయన జీత మిస్తాడు. మంచి చేసిన వానికి, చెడు చేసిన వానికి ప్రతి ఫలముంది. వ్యవసాయదారుడు పంట పండి నప్పుడు చేను కోసుకుంటాడు. దేవుని మహిమార్ధం సేవాసాధనాలుగా పని చేసిన క్రైస్తవ సంఘాలు, విశ్వాసులు తమ తమ ప్రతిఫలాన్ని పొందగా, యిష్టానుసారంగా, దైవమనస్సుకు వ్యతిరేకంగా జీవించి, దేవుడిచ్చిన తలాంతుల్ని సిరిసంపదల్ని దుర్వినియోగ పరచినవాడు తగ్గట్టుగా ప్రతిఫలాన్ని వారు పొందుతారు. "ఆయన ప్రతివానికి వానివాని క్రియల చొప్పున ప్రతిఫల మిచ్చును, సత్క్రియను ఓపికగా చేయుచు, మహిమను ఘనతను అక్షయతను వెదుకువారికి నిత్యజీవము నిచ్చును" (రోమా 2:6,7) "దేవునికి పక్షపాతము లేదు" (రోమా 2:11). ఈ ప్రతిఫలం, వారి నోటిమాటనుబట్టి, వారి జీవితాన్నిబట్టి వారి మనస్సాక్షినిబట్టి అందరూ ఆయనకే లెక్క చెప్పాలి. (రోమా 14:12, ప్రకటన 20:12,13, 22:12).**(సశేషం)**

## * : పాఠకులకు అతి ముఖ్య గమనిక : *

'పరిశుద్ధత' మాసపత్రిక ఆన్‌లైన ఎడిషన్ ప్రారంభించిన తర్వాత పత్రిక కావాలని అభ్యర్ధిస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా మేము ఎప్పుడు పత్రిక చందా గురించి పాఠకులను అడగలేదు. అయితే క్రొత్తగా పత్రిక కావాలంటున్న వారికి పంపించాలంటే ఎక్కువ పత్రికలు ముద్రించాలి. కాబట్టి పాఠకులు చందా తప్పని సరిగా కట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఒకవేళ పత్రిక చదివే తీరిక లేక మీరు చదవక పోతుంటే పత్రిక 'స్టాప్' చెయ్యమని 9440217726 నంబరుకు మాకు ఒక్క మెసేజ్ పెట్టటం వలన, ఆ పత్రికను కొత్తవారికి పంపిస్తాము. **పాఠకులకు మేము ఇలాంటి అభ్యర్ధన పంపినప్పుడు చాలామంది స్పందించటం లేదు. కాబట్టి అసలు వారు పత్రిక చదువుతున్నారో లేదో కూడా అర్ధంకాని పరిస్థితి. కాబట్టి మా అభ్యర్ధనలకు స్పందించని వారు పత్రిక చదవని వారుగానే భావించి, జనవరి–2017 నుండి వారికి పత్రిక నిలిపి వేయుటకు నిర్ణయించాము.** కావున చందా చెల్లించని వారు డిసెంబరులోపు చందా చెల్లించగలరని ఆశిస్తున్నాను. **–ఎడిటర్**

స్త్రీల విభాగము

# లూదియ



శ్రీమతి కె. రేచల్ జోసఫ్,
హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్

పరిశుద్ధ గ్రంథములో పౌలుగారి పత్రికలలోని కొన్ని వచనాలను ఆధారం చేసుకొని నేటి వరకు అనేకులు పౌలుగారు స్త్రీలను క్రీస్తుకు దూరంగా ఉంచారని భావిస్తారు. పౌలుగారు తన యొక్క రెండవ సువార్త దండయాత్రలో పౌలుగారు యూరప్‌ను దర్శిస్తాడని అనుకోలేదు. కాని దేవుని చిత్తానుసారము అయాగాగియాస్ సముద్రము దాటి యూరవ్‌నందు ప్రవేశించినపుడు ఫిలిప్పీ పట్టణము రోమీయులకు ప్రవాసస్థానమై యుండెను. అనగా రోమా సైన్యములో గొప్ప ఉద్యోగములు చేసిన ఆఫీసర్లు, సైనికాధికారులు ఇచ్చట స్థిర నివాసము చేసికొనిరి. అంతేకాక ఈ పట్టణము క్రీస్తుకు పూర్వము 336లో అలెగ్జాండర్ చక్రవర్తి యొక్క రాజధానియై యుండెను. ఇంత గొప్ప పట్టణము దేవుడు తన సిలువ రాజ్యవాప్తి నిమిత్తము ఎంచుకొనినపుడు జ్ఞాని ఏమయ్యెను, శాస్త్రి ఏమయ్యెను, ఈ లోకపు తర్కవాది ఏమయ్యెను. ఈ లోక జ్ఞానమును దేవుడు వెఱ్ఱితనముగా చేసియున్నాడు గదా!

పౌలుగారు స్థాపించిన సంఘములన్నిటిలో తనకు అత్యంత ప్రియపాత్రమైనది ఫిలిప్పీ సంఘము. పౌలుగారిని అమితముగా ప్రేమించి ఆయన కష్టములన్నిటిలో ఆదుకొనినది. గొప్ప సంఘస్థాపనకు దేవుడు ఉపయోగించు కొనిన వ్యక్తి ఒక స్త్రీ. క్రీస్తు ప్రభువు ఈ లోకమునకు వచ్చినప్పుడు ఆయనకు అన్ని విషయములలో సేవలో తోడ్పడిన వారు స్త్రీలు. అయితే దేవుడు స్త్రీల కొరకు సేవార్థమై వాడబడుటకు స్త్రీలకు కొన్ని ప్రత్యేకమైన తలాంతులు ఇచ్చియున్నాడు. అందులోని భాగమే ఉపచారము చేయుట. లూదియ ఆమెయు, ఆమె ఇంటి వారును బాప్తిస్మము పొందినపుడు ఆమె 'నేను ప్రభువు నందు విశ్వాసముగల దానినని మీరు ఎంచితే నా యింటికి వచ్చియుండుడని వారిని బలవంతము చేసెను.

ఇంత గొప్ప సంఘస్థాపన ఒక సామాన్యురాలి ఇంటిలో స్థాపించబడియుంటే స్త్రీలమైన మనకు ప్రభువు బిడ్డలను పరామర్శించుట ద్వారా ఇంకా గొప్ప సేవ చేయగలము.

అనాది కాలముగా స్త్రీలు రాజ్యములను పరిపాలిం చారు. యుద్ధములు చేశారు అన్ని విషయములలో పురుషు లతో సమానముగా పోరాడిరి. అయితే స్త్రీలు బలహీనులని, స్త్రీలు సంఘములో మౌనులై ఉండవలెనని అసందర్భముగా కల్పించుకొని దైవరాజ్య వ్యాప్తి కొరకు వారిని ముందుకు సాగనియ్యక యుంచారు. నేటి తరములో పురుషునితో స్త్రీ అన్ని విషయములలో సమానముగా మెలుగుచున్నప్పుడే నేటి స్త్రీలమైన మనము నాటి లూదియని సంఘ స్థాపనకు వాడుకొనినట్లు మనలను కూడా అనేక ఆత్మల రక్షణార్థమై దేవుడు వాడుకుంటాడు. లూదియ గ్రీకు దేశస్థురాలైనను యూదా మతమునందు అధిక ఆసక్తి కలిగియుండి ఫిలిప్పీ పట్టణములో సమాజ మందిరములు లేకున్నను ఆ పట్టణము ప్రక్కన ప్రవహించుచున్న నది ఒడ్డున ప్రతి విశ్రాంతి దినమున ప్రార్థన జరుపుచుండెను. ఆమెను గురించి దైవ వాక్యము ఏమని చెప్తుందంటే ఆమె ఊదరంగు పొడిని అమ్ము వ్యాపారస్తురాలైనను ఆమెను దైవభక్తిగల స్త్రీ అని పిలిచిరి. పౌలును, సీలయు చెరసాల నుండి విడిపించబడినప్పుడు చెరసాల యజమాని కుటుంబము మొత్తము బాప్తిస్మము పొందినను ఉదయమైనప్పుడు శిష్యులు లూదియ యొక్క ఇంటికి వెళ్ళి అచ్చటనే పరిచర్య పొందిరి. గనుక నేటి స్త్రీలమైన మనము ప్రభువు రాజ్య విస్తరణలో మన భాగమును మనము నెరవేర్చిన యెడల దేవుడు ఆయన ఆశీర్వాదములతో పాటు తన రాజ్యవ్యాప్తిని కూడా పెంపొందించగలడు. ఆమెన్.

సాక్ష్యము

2

# బాంబులు పట్టిన చేతిలో బైబిల్...!

**60,70 సార్లు ప్రభువు మరణం నుండి తప్పించాడు**

నా పద్నాలుగేళ్ళ రాజకీయ జీవితం దినదినగండంగా గడిచింది. దాదాపు 60 లేక 70 సందర్భాల్లో నేను చనిపోయి ఇప్పుడు నరకాగ్నిలో కాలుతూ ఉండవలసింది. ఒకసారి వేరే ఊరు వెళ్ళినప్పుడు శత్రువులు నన్ను చంపేయ్యాలని చూశారు. రోడ్డు మీద ఒక కూల్‌డ్రింకు షాపులో హంతకముఠా నా కోసం కాపువేసింది. ఆ షాపుకి నేను తరచూ వెళుతుండేవాణ్ణి. వారు ఆ షాపును ఎంచుకొని బాంబులతో నన్ను చంపాలని చూశారు. అయితే దేవుని దయవలన వేరొక దారిగుండా మా ఊరు తిరిగి వచ్చేశాను. నన్ను అలా చంపెయ్యాలని వారు పథకం వేసినట్టు ఆ తరువాతనే నాకు తెలిసింది. మరొకసారి బస్టాండు వద్ద నేను నిరాహారదీక్షకు కూర్చున్నపుడు శత్రువులు నన్ను చంపాలని చూశారు. అర్ధరాత్రి దాటాక పోలీసుల వేషాల్లో వచ్చి నాపై బాంబులు వేయాలనుకున్నారు. శక్తివంతమైన నాటుబాంబులు వారివద్ద ఉన్నాయి. బాగా దగ్గరగా వచ్చి తమ పని పూర్తి చేసుకుందామని వారి ప్లాను. వారంతా రాత్రి బీటు కానిస్టేబుల్స్‌లాగా వచ్చారు. వారు నన్ను సమీపిస్తుండగా కాపలా ఉన్న అసలు పోలీసులు వారిని గుర్తించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని బాంబులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన పేపర్లలో కూడా వచ్చింది. ఇదంతా కేవలం దేవుని కృపే. మరొక సందర్భంలో ఎన్నికల దినాన ఓట్లు రిగ్గింగు చేయడం కోసం నా వద్ద ఉన్న బలగాన్నంతటినీ ఉపయోగించడానికి నిశ్చయించుకుని ఉన్నాను. ఆయుధాలు, తుపాకులు, బాంబులు చేతపట్టుకొని నేను, నా బాడీగార్డులు నాలుగైదు జీపుల్లో గ్రామాల్లోకి వెళ్ళాం. ఒక గ్రామంలో ప్రవేశించి కాల్పులు ఆరంభించాం. ఓట్లు వెయ్యడానికి క్రమంగా లైనులో నిలబడ్డ ప్రజలు భయంతో చెల్లాచెదురు అయిపోయారు. ఎలక్షన్ ఎజెంటు కూడా ప్రాణభయంతో పారిపోయాడు. నా బాడీగార్డులు ఎలక్షన్ బూతుల్లో చొరబడి రిగ్గింగ్ చేశారు. అక్కడి నుంచి మరో గ్రామం వెళ్ళాం. గవర్నమెంటు సెంట్రల్ రిజర్వు పోలీసులు (సి.ఆర్.పి.) మా కోసం దారికాచి ఉన్నారు. మా జీపులు అక్కడికి చేరుకోగానే దాగి ఉన్న వారంతా ఒక్కసారిగా మాపై కాల్పులు ప్రారంభించారు. నేను మొదటి జీపులో ముందు సీటులో డ్రైవరు ప్రక్కన కూర్చున్నాను. సి.ఆర్.పి. వాళ్ళ బుల్లెట్లు జీపు ముందు భాగంలో నుండి దూసుకువచ్చాయి గాని నాకు ఏదీ తగల్లేదు. వెంటనే జీపులు ఆపి క్రిందికి దిగాము. కాల్పులు జరుగుతూనే ఉన్నాయి. నా ఎడమ ప్రక్కన దయవల్ల కొద్దిలో నాకు ప్రమాదం తప్పింది. గాయపడిన వారినీ నన్నూ పోలీస్‌స్టేషన్‌కి తీసుకువెళ్ళారు. మా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. మూడు నెలలపాటు జైల్లో ఉన్నాం. జైల్లో కూడా మాకు నచ్చిన రీతిలో ప్రవర్తించే వాళ్ళం. జైలు నియమాలను ఎలాబడితే అలా ఉల్లంఘించేవారం. విస్కీ, బ్రాందీ మొదలైనవి యధేచ్ఛగా మాకు అందుతూ ఉండేవి. మేము వారి అదుపులో ఉన్నప్పటికీ జైలర్‌కీ, అతని సిబ్బందికీ మానుంచి ప్రమాదమే అని భయపడేవారు.

ఒకసారి మా బాడీగార్డులతో నేను వెళ్తుండగా నా శత్రువులు ఒక ట్రక్కులో మాకు ఎదురువచ్చి, దారికి అడ్డంగా నిలిపారు. వెనక్కిపోవడం లేదు, కదలడం లేదు. నేను, నా బాడీగార్డులకు కాల్పులు జరపమని చెప్పాను. వారి లారీ కేబిన్ మీద శక్తివంతమైన బాంబులు ఉన్న పెట్టెతో మా శత్రువులు వచ్చారు. వాటితో మాపై దాడి చేయాలని వారి పథకం. ఆ పెట్టెలను దింపుతున్న సమయంలో అవి పొరపాటున కిందపడిపోయి బాంబులన్నీ ఒక్కసారి పేలాయి. అది భూమి దద్దరిల్లిపోయే పేలుడు. లారీలోని కొందరు అక్కడికక్కడే చనిపోయారు. పిట్టల్లాగా లారీలో నుంచి

ఎగిరిపడ్డారు. చనిపోయిన వాళ్ళ చర్మం, మాంసపు ముద్దలు లారీ అంతట అతుక్కుపోయింది. బ్రతికినవాళ్ళు లారీలో నుంచి దూకి పొలాల్లోకి పారిపోయారు. అలా పారిపోతున్న వారిలో పన్నెండేళ్ళ కుర్రవాడు కూడా ఉన్నాడు. పేలుడులో అతని చెయ్యి తెగిపోయింది. చర్మం సాయంతో ఆ చెయ్యి అతని ఒంటికి వేలాడుతోంది. మాకు జాలిలేదు. పారిపోతున్న వారిపై మావాళ్ళు కాల్పులు కొనసాగించారు. నేనూ, నా బాడీగార్డులు రాక్షసులవలె ప్రవర్తించేవాళ్ళం. మాకు ఏమాత్రం జాలిలేదు. ప్రాణాలు పోవలసి వచ్చినా, తీయవలసి వచ్చినా సరే, ఏది ఏమైనా మా మాటే నెగ్గాలి. చాలాసార్లు చావునుండి అద్భుతరీతిలో తప్పించుకున్నాను. నేషనల్ సెక్యూరిటీ చట్టంక్రింద అరెస్టయి కూడా హత్యలు చేయడానికి వెనుకాడే వాణ్ని కాదు. సంవత్సరంకంటే పైగా హైదరాబాదులోని ముషీరాబాద్ జైల్లో ఉన్నాను. జైల్లో ఉన్నప్పుడు డాక్టర్ల ద్వారా నాపై విషప్రయోగం చేశారు. తప్పుడు ఎన్‌కౌంటర్‌లో నన్ను కాల్చెయ్యాలని కూడా అనుకున్నారు. ఒకసారి నా కంట్లో యాసిడ్ పోయాలని ప్రయత్నం చేశారు. దేవుని కృపనుబట్టి నేను బ్రతికి బయటపడ్డాను. నేను రాస్తున్న రాజకీయ శిథిలాలనుండి పరలోక భవనాలకు అనే పుస్తకంలో నా జీవితం గురించి మరిన్నీ వివరాలుంటాయి.

## అన్నీ ఉన్నాయిగానీ శాంతి లేదు

నా పాప భూయిష్టమైన, భయంకరమైన జీవితం మూలంగా ఎంతగానో దేవుని కోపాన్ని చవిచూశాను. నా బ్రతుకులో శాంతి అనేది లేదు. దేవుని శాపం నాపైకి వచ్చిందనుకుంటా. రాత్రిళ్లు నిద్రపట్టేది కాదు, నిద్రమాత్రలు, ఇంజెక్షన్లు అవసరమయ్యేవి. భయంతో వణికించే కలలొచ్చేవి. పీడకలలతో అర్ధరాత్రుళ్లు మెలకువ వచ్చేసేది. అందరూ నిద్రపోతుంటే నేను మాత్రం కాలుగాలిన పిల్లిలా తిరుగాడు తుండేవాడిని. డబ్బు, ఆస్తి, అధికారం, అంతస్తు అన్నీ ఉన్నాయిగానీ, మనశ్శాంతి కరువైంది. యోగాద్వారా, భావాతీత ధ్యానం ద్వారా మనశ్శాంతి దొరుకుతుందను కున్నాను. కొన్ని సందర్భాల్లో సంతోషంగానే ఉండేది గానీ, మనశ్శాంతి లేదు. చాలామంది సైకియాట్రిస్టులను కలిశాను. ఒకసారి ఒక ప్రఖ్యాత సైకియాట్రిస్టు నా మెదడు స్కాన్‌చేసి ఆరోగ్యంగానే ఉందని కొన్ని మాత్రలిచ్చాడు. అవి నాకు మనశ్శాంతి నివ్వలేదు. అలాంటి గడ్డు స్థితిలో మరింతగా తాగడం మొదలుపెట్టాను. కొన్నిసార్లు తెల్లవారి 3 గంటలకే తాగడం మొదలుపెట్టేవాణ్ణి. తాగకపోతే చేతులు వణికేవి. అతిగా తాగడం వల్ల రక్తం కక్కుకునేవాణ్ణి.

కొన్నిసార్లు రోజుకి రెండు ఫుల్ బాటిల్స్ మద్యం తాగేసే వాణ్ణి. సిగరెట్లకు అంతే లేదు. అప్పటికి 20 సంవత్సరాల నుండి 20 నుండి 40 వరకు సిగిరెట్లు తాగి ఉంటానేమో. అవిటివాడినైపోతాననీ, మతిస్థిమితం కోల్పోయి పిచ్చాసుపత్రి పాలవుతాననీ అనుకునేవాణ్ణి. జీవితంలో మొట్టమొదటిసారి పూర్తిగా నిస్పృహ అవహించింది. ఇటు వంటి పరిస్థితుల్లో ఎప్పటికీ ఎమ్మెల్యే కాలేనని ఘంటాపథంగా అర్థమైపోయింది. ఇది నన్ను మరీ పూర్తిగా కుంగదీసింది. నా జీవితంలో ప్రతి నిమిషమూ నైరాశ్యపు చీకటి కూపాల్లోకి దిగిపోయాను. ఈ దరిద్రపు గొట్టు జీవితంవల్ల ఏమీ ప్రయోజనం లేదని అర్థమైపోయింది. జీవితమంటే విరక్తి పుట్టింది. ఈ ఓటమి, ఈ పిడకలలు, అనారోగ్యం, జీవితంలో శూన్యం, దీనంతటినీ అంతం చేసేద్దామనుకున్నాను. నా పరిస్థితి గురించి ఎవరీకి చెప్పలేదు. నా బెడ్‌రూములోకి వెళ్ళి లోపల తాళం వేసుకొని గళ్లు నింపిన రివాల్వర్ తలకు గురిపెట్టుకొని పేల్చుకుందా మనుకున్నాను. అయితే “ మరణం తరువాత ఏమవుతుంది?” అనే ప్రశ్న నాకు అడ్డు పడింది. చావంటే భయం, బ్రతకడం కష్టం. మేడపై నుండి దూకుదామనుకున్నాను. రైలు కింద పడదామనుకున్నాను. రైఫిల్‌తో నా తల పేల్చి వేసుకుందామనుకున్నాను. దాన్ని నా తలకు ఆనించి బొటనవేలితో ట్రిగ్గర్ నొక్కాలనుకున్నాను. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే నా తల పేలిపోవాలి. అయితే చావంటే భయమేసింది. ఈ దౌర్భాగ్య జీవితాన్ని అంతం చేసుకోవడమెలానో అర్థం కాలేదు. ఎవరిదన్నా సమాధి పెట్టి మోసుకువెళ్తుంటే, నేను చనిపోతే ఏమవుతుందో అని గుబులు పుట్టేది. రాజకీయాల్లో నేను గుండెలు తీసిన బంటుని. కాని చావనే భయం నన్ను పీడించింది.

**(ఇంకావుంది)**

# లోకంతీరు



(పుట్టుక చావు మధ్య సంబరం)

**నీ చేతిపనియైన నీ ఆకాశములను నీవు కలుగజేసిన చంద్రనక్షత్రములను నేను చూడగా నీవు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటివాడు?**

అంటే రోజులో కాసేపు బైబిలు చదవటం, ప్రార్థన చేసుకోవటం, ఆదివారం చర్చికి వెళ్ళడం, దశమ భాగము ఇవ్వడం, ఏదైనా మేలు జరిగినప్పుడు కృతజ్ఞతా కూటం పెట్టుకోవడం, ఏదైనా కష్టం వస్తే ఉపవాస ప్రార్థనలు చేయటం వరకు మాత్రమే పరిమితం చేస్తారు. తమ జీవితంలో దేవునికి పూర్తి అధికారం ఇవ్వరు. అంటే ప్రతి చిన్న విషయానికి దేవునికి అధికారం ఇవ్వరు. దేవుడు వాళ్ళ జీవితంలో ఒక భాగంగా పరిగణించరు. దివారాత్రములు ధ్యానించేటంత ప్రాధాన్యత దేవునికి ఇవ్వరు. అలాంటప్పుడు వాళ్ళ జీవితాల్లో జరిగే మేళ్ళు కూడా పరిమితంగానే ఉంటాయి. మనిషి పూర్తిగా దేవుని మీద ఆధారపడి, వాళ్ళ జీవితాల్లో దేవుని చిత్తానికి చోటు ఇవ్వాలని దేవుడు కోరుకుంటాడు. మనిషి కోరితే వాళ్ళ పూర్తి జీవితాన్ని దేవుడే నడిపించాలనుకుంటాడు. ఇశ్రాయేలీయులు దేవున్ని కాకుండా వాళ్ళ ముందర పోవడానికి ఒక రాజుని కోరుకున్నప్పుడు దేవుడు పక్కకి తప్పుకున్నాడు. అంటే ఒక మనిషి తన జీవితాన్ని ఎలాగైనా మలుచుకొనే పూర్తి అధికారం దేవుడు మనిషికి ఇచ్చాడు. దేవా, నా జీవితాన్ని నువ్వే నడిపించయ్యా అని అడిగితే దేవుడు తప్పకుండా నడిపిస్తాడు.

**పుట్టుక**

**దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.2:7)**

మరి దేవునికి ఎలాంటి ప్రత్యామ్నాయం లేకుండా వుంటే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఇష్టమున్నా లేకున్నా దేవున్ని ఆశ్రయించాల్సిందే కదా! అందుకే దేవుడు డబ్బుని తనకు ప్రత్యామ్నాయంగా సృష్టించుకున్నాడు. డబ్బు అంటే ఏంటి? మనం ఇప్పుడు ఉపయోగిస్తున్న ఈ కరెన్సీ, నాణేలు, వెండి, బంగారము కాదు. డబ్బు అంటే మనిషి ఆధారపడటానికి ఒక ఆసరా. కాబట్టి ప్రతి మనిషి ఈలోకంలో బ్రతకటానికి ఆసరాగా దేవున్ని కాని, డబ్బుని కాని ఎన్నుకోవాల్సిందే. ఈ లోకంలో ప్రతి మనిషి డబ్బు లేనిదే జీవించలేడు అన్న భావం ప్రతి ఒక్కరిలో బలంగా నాటుకుపోయింది. డబ్బు సంపాదనే ఏకైక లక్ష్యం అదే జీవిత పరమావధి అనే వాదం ప్రతి ఒక్కరిలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. డబ్బే మనిషిని నడిపించే ఏకైక సాధనం అని గట్టిగా నమ్ముతారు. డబ్బుకోసం ఏమైనా చేయడానికి సిద్ధపడతారు. ఇంకా సిగ్గుపడాల్సిన విషయం ఏమిటంటే దేవుని సేవకులు, అంటే దేవుని పని చేసేవారు సైతం దేవుని పని చేయడానికి మనుష్యుల మీద ఆధారపడతారు. ఎవరైనా డబ్బులు ఇస్తే దేవుని సేవ చెయ్యాలి అనుకుంటారు. దేవుని పని చేస్తాము డబ్బులు ఇవ్వండి అంటూ మనుష్యులను నానారకాలుగా ప్రేరేపిస్తుంటారు. ఎవరైనా డబ్బులు ఇస్తే దేవుని పని చేయడంలో గొప్పతనం ఏముంది. ఎవరికి వాళ్ళు కష్టపడి పనిచేసి సంపాదించిన డబ్బుతో వారే దేవుని పని చేస్తే కదా దేవున్ని ప్రేమించడం. పోనీ, తను చేసే దేవుని పనికి దేవుడే ఇవ్వాలి అని ఎవరినీ ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని డబ్బులు అడగకుండా వుంటే దేవుడు ఎవరినైనా ప్రేరేపించి డబ్బులు ఇవ్వడా? మనం ప్రేరేపించి డబ్బులు ఇచ్చేటట్లు చేసేదానికి, వారంతట వారు అడక్కుండా ఇచ్చే దానికి తేడా లేదా? డబ్బు లేకపోతే జరగని పని దేవుని పనా? డబ్బులు దొరకలేదని టెన్షన్ పడుతూ దేవుని పని చేయటం, అప్పులు చేసి దేవుని పని చేయటం దేవుడు అంగీకరిస్తాడా? దేవుని పని చేసేవారు ఎప్పుడూ ప్రశాంతంగా, ధైర్యంగా వుండాలి. ఎలాంటి టెన్షన్స్ లేకుండా దేవుని పని చెయ్యాలి. లగ్జరీకి అలవాటు పడి దేవుని పని చేసేవారు, ఆ లగ్జరీని కాపాడుకోడానికి దేవుని పనినే అడ్డం పెట్టుకో వాల్సిన పరిస్థితి

వస్తుంది. అప్పుడు వారు అక్రమము చేయు వారి జాబితాలో చేరిపోతారు. ("ప్రభువా, ప్రభువా మేము నీ నామమున ప్రవచింప లేదా? నీ నామమున దయ్యము లను వెళ్ళగొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు నేను – నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయువారలారా, నా యొద్ద నుండి పొండని వారితో చెప్పుదును" మత్తయి 7:22,23). ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు. మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరదు అని దేవుడు చెప్పాడు. అంటే ఎవరు కూడా దేవున్ని డబ్బుని ఒకేసారి ప్రేమించలేరు. దేవున్ని ప్రేమించేవారు డబ్బుని ప్రేమించరు. డబ్బుని ప్రేమించేవారు దేవున్ని ప్రేమించలేరు. ఈ లోకంలో మన అవసరా లన్నీ తీర్చుకోడానికి ఖచ్చితంగా డబ్బు అవస రమే. ఏదేనుతోటలో మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టును వేసింది దేవుడే, అయితే దాని జోలికి వెళ్ళవద్దని ఖచ్చితంగా చెప్పాడు. అలాగే ఈ లోకంలో డబ్బును ప్రవేశపెట్టింది దేవుడే. అయితే డబ్బు మీద ఆధారపడవద్దు అని, డబ్బును ప్రేమించవద్దని దేవుడు చెప్తున్నాడు. అయితే మనిషి డబ్బుకోసం దేవున్నే లెక్క చెయ్యడం లేదు. డబ్బు సంపాదన కోసం అనేక రకాలుగా అన్వేషణ చేస్తు న్నాడు. మనిషిని సృష్టించిన దేవునికి మనిషి అవసరాలను తీర్చకుండానే ఉంటాడా? మనిషి ప్రాథమిక అవసరాలు దేవుడు తప్పకుండా తీరుస్తాడు (ఏమి తిందుమో యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, యేమి ధరించుకొందమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి... ఆహారము కంటే ప్రాణమును, వస్త్రముకంటే దేహమును గొప్పవి కావా... ఎవడు చింతించుట వలన తన యెత్తు మూరెడెక్కువ చేసికొనగలడు?... మొదట ఆయన రాజ్యమును నీతిని వెదకుడి అప్పుడవన్నియు మీకు అనుగ్రహించబడును. మత్తయి 6:25-30). అయితే మనిషి దేవుని రాజ్యమును వెదకకుండా తన లగ్జరీ అవసరాలకోసం (టి.వి., ఫ్రిజ్, కారు, బంగళా, బ్యాంకు బ్యాలెన్స్, వగైరా వగైరాలు) డబ్బు సంపాదనే ధ్యేయంగా జీవిస్తున్నాడు. దేవున్ని అడిగితే ఏదైనా అనుగ్రహిస్తాడుగానీ, వాటి వలన వచ్చే కష్టనష్టాలకు మనిషే బాధ్యత వహించాలి. మనిషి జీవితం సంతోషంగా, సమాధానంగా సాగిపోవాలంటే దేవున్ని ఆశ్రయించటం తప్ప వేరే మార్గం లేదు. (ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము, కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి తమ్మును తామే పొడుచుకొనిరి. 1 తిమోతి 6:10; ధనాపేక్ష లేనివారై మీకు కలిగిన వాటితో తృప్తి పొందియుండుడి. హెబ్రీ 13:5; ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తము లును, హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. 1తిమోతి 6:9;). మనం డబ్బు సంపాదించడానికి కారణం మన అవసరాలే కదా! మన ప్రతి అవసరాన్ని దేవుని యెదుట బలిపీఠం మీద బలివ్వాలి.

**చావు**

**ఏలయనగా నేల నుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను (ఆది.3:18)**

మనందరం చస్తాము అని తెలిసీ కూడా దేవున్ని లెక్క చెయ్యము. వెర్రివాడా, ఈ రాత్రి నీ ప్రాణము అడుగుచున్నారు, నీవు సిద్ధపరచి నవి ఎవనివగును అని దేవుడు అడుగుతాడు. దేవుని యెడల ధనవంతుడు కాక తనకొరకే సమకూర్చుకొనువాడు ఆలాగుననే ఉంటాడని యేసుప్రభువు చెప్పాడు (లూకా 12:20,21). చావు ఎప్పుడూ మన పక్కనే ఉంటుంది. కాలుజారి క్రిందపడ్డా, తేలు కుట్టినా, పాము కరచినా, యాక్సిడెంట్ అయినా, గట్టిగా ఒక్క తన్ను తన్నినా మనిషి ప్రాణం పోతుంది. అలాంటిది మనిషి బ్రతుకు. ఇలాంటి సెక్యూరిటీ లేని బ్రతుకు బ్రతకటానికి మనిషి పడే పాట్లు చూసి దేవుడు చాలా బాధపడతాడు. ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా! నా యొద్దకు రండి నేను మీకు విశ్రాంతి కలుగుజేస్తాను అని దేవుడు పిలుస్తుంటే ఎవరన్న లెక్క చేస్తున్నారా? కష్టంతో, బాధతో, వేదనతో జీవితాన్ని సాగించడం దేవుని చిత్తం కాదు. జీవితానికి అంతం చావు, ఆ చావు ఎప్పుడు వస్తుందో ఎవరికీ తెలీదు, అయితే దేవున్ని నమ్మిన వారికి దేవుడు నిర్ణయించిన ఆయుష్షు మొత్తం అనుభవిస్తారు. లేకపోతే అర్ధాంతరంగా చస్తారు. మనిషి దేవుని కాపుదల లోనికి తనంతట తానుగా వచ్చినప్పుడు దేవుడు ఆ మనిషికి ఒక కంచె వేస్తాడు (యోబు 1:10). అప్పుడు ఎలాంటి ఆపద ఆ మనిషికి రాదు. **(ఇంకావుంది)**

# బైబిలు కథలు - అబ్రాహాము

పిల్లలూ బాగున్నారా? రోజూ బైబిల్ చదువుతున్నారా? బైబిలు గ్రంథం చాలా గొప్పది. మనం ప్రతిరోజూ బైబిల్ చదవటం వలన మన జీవితాలు మారిపోయి ఒక క్రమమైన జీవితం అలవాటు అవుతుంది. మీరు ఎప్పుడైనా బ్రష్ చేసుకోవడం మర్చిపోయారా? లేదు కదా! అలాగే మనం బైబిల్ చదవటం ఎప్పటికీ మర్చిపోకూడదు. సరే, మనం పోయిన నెలలో బాబేలు గోపురం గురించి తెలుసుకున్నాం కదా! మరి ఈ నెలలో విశ్వాసులకు తండ్రి అయిన అబ్రాహాము గురించి తెలుసుకుందాం.

కల్దీయుల ఊరు అను పట్టణములో తెరహు అనే ఒకాయనకి అబ్రాము, హారాను, నాహోరు అని ముగ్గురు పిల్లలు వున్నారు. వారిలో హారాను, నాహోరు అను వారికి పిల్లలు పుడతారు కాని, అబ్రాముకు పిల్లలు పుట్టరు. హారానుకు లోతు అను కుమారుడు పుడతాడు. అయితే హారాను అందరికన్నా ముందే చని పోతాడు. అబ్రాము భార్య పేరు శారాయి. నాహోరు భార్య పేరు మిల్కా.




అయితే ఒకరోజు తెరహు తన కుమారుడైన అబ్రామును తన కోడలైన శారాయిని, తన కుమారుడైన హారాను కుమారుడైన లోతును వెంటబెట్టుకొని హారాను అనే పట్టణము వచ్చి అక్కడ నివాసము ఉంటారు. కొంత కాలానికి అక్కడే తెరహు చనిపోతాడు. తెరహు జీవించిన కాలము 205 సంవత్సరాలు.

అప్పుడు దేవుడైన యెహోవా అబ్రాముతో "నీవు లేచి నీ దేశము నుండియు, నీ బంధువుల యొద్ద నుండియు, నీ తండ్రి యింటి నుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళుము. నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును, నీవు ఆశీర్వాదముగా నుందువు, భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడును" అని చెప్తాడు. అప్పుడు అబ్రాము దేవుడు చెప్పినట్లే వెళ్తాడు. అబ్రాముతో లోతు కూడా వెళ్తాడు. అప్పుడు అబ్రాము వయస్సు 75 సంవత్సరాలు. అబ్రాము హారానులో తాను సంపాదించిన ఆస్తిని తీసుకొని శారాయి, లోతుతో కలిసి కనాను దేశం వస్తాడు. అప్పుడు దేవుడు అబ్రాముకు కనబడి "నీ సంతానమునకు ఈ దేశము ఇస్తాను" అని చెప్తాడు. అప్పుడు అబ్రాము అక్కడ నుండి బయలుదేరి బేతేలుకు హాయికి మధ్య గుడారము వేసుకొని యెహోవాకు బలిపీఠము కట్టి యెహోవా నామమున ప్రార్థన చేస్తాడు.

తర్వాత కొని రోజులకు అక్కడ కరువు వస్తుంది. అప్పుడు అబ్రాము ఐగుప్తు దేశము వెళ్తాడు. శారాయి చాలా అందమైనది. అందుకని అక్కడ ప్రజలు శారాయి కోసం అబ్రామును చంపుతారేమో అనుకొని ఆమెతో చెప్తాడు ఎవరైనా అడిగితే నా చెల్లెలువని చెప్పమని. అలాగే చెప్తుంది. అప్పుడు ఆ దేశపు రాజైన ఫరో శారాయిని తన ఇంటికి తెప్పిస్తాడు. అయితే దేవుడు శారాయిని కాపాడ టానికి ఫరో ఇంటి వారిని మహావేదనలతో బాధిస్తాడు. అప్పుడు ఫరో శారాయిని అబ్రాము భార్య అని తెలుసుకొని అబ్రాముని పిలిచి శారాయిని తీసుకుపొమ్మని చెప్తాడు. అప్పుడు అబ్రాము శారాయిని లోతుని వెంటబెట్టు కొని ఐగుప్తు నుండి పాలస్తీనాకు వెళ్తాడు. అబ్రాము వెండి, బంగారము, పశువులు కలిగిన చాలా ధనవంతుడు. అతడు ప్రయాణం చేస్తూ మొదట బేతేలులో కట్టిన బలిపీఠము దగ్గరకు వచ్చి అక్కడ నివసిస్తాడు. లోతుకు కూడా చాలా ఆస్తి, పశువులు పనివాళ్ళు చాలామంది ఉంటారు. వారి పశువులు, పనివారు ఎక్కువగా ఉండటం వలన ఆ ప్రదేశము వారికి సరిపోకుండా ఉంది. అక్కడ అబ్రాము పశువుల కాపరులకు, లోతు పశువుల కాపరులకు గొడవలు వస్తుం

టాయి. అప్పుడు అబ్రాము లోతుతో 'మనం బంధువులము కాబట్టి మనకు, మన పశువుల కాపరులకు గొడవలు ఉండకూడదు. మనం వేరుగా ఉందాము, ఈ దేశం నీ యెదుట ఉంది కదా, నువ్వు కుడి తట్టు వెళ్తే నేను ఎడమతట్టు వెళ్తాను, నువ్వు ఎడమ తట్టు వెళ్తే నేను కుడి తట్టు వెళ్తాను' అని చెప్పినప్పుడు లోతు కనులెత్తి యొర్దాను ప్రాంతమంతా చూస్తాడు. అక్కడ సొదొమ గొమొఱ్ఱా అనే పట్టణాలు కనిపిస్తాయి. ఆ ప్రదేశం యెహోవా తోటలాగా, ఐగుప్తు దేశంలాగా నీళ్ళు పారు దేశంలా కనిపించింది. అప్పుడు లోతు అక్కడ నివసించడానికి వెళ్ళిపోతాడు. అలా అబ్రాము, లోతు వేరుపడి పోతారు. సొదొమ మనుష్యులు దుష్టులు, యెహోవా దృష్టికి బహు పాపులుగా ఉన్నారు. అయితే అబ్రాము కనాను దేశము లోనే ఉండిపోతాడు. లోతు అబ్రాము వేరుపడిన తర్వాత దేవుడు మరలా అబ్రాముకి కనబడి "ఇదిగో నీ కన్నులెత్తి నీవు ఉన్న చోటు నుండి ఉత్తరపు తట్టు, దక్షిణము తట్టు, తూర్పుతట్టు, పడమర తట్టు చూడుము. ఎందుకంటే, నువ్వు చూస్తున్న ఈ ప్రదేశ మంతటిని నీకును నీ సంతానము నకు సదాకాలము ఇస్తాను. మరియు నీ సంతానమును భూమి మీద వుండు రేణువులవలె విస్తరింపచేస్తాను. ఎవ్వరైనా భూమి మీద రేణువులను లెక్కింప గలిగితే నీ సంతానమును కూడా లెక్కించవచ్చును. ఈ దేశము పొడుగున వెడల్పున నడువు అదంతా నీకు ఇస్తాను" అని చెప్తాడు. అప్పుడు అబ్రాము హెబ్రోను వెళ్ళి అక్కడ గుడారం వేసికొని యెహోవాకు బలిపీఠం కడతాడు. అబ్రాము కథ చాలా పెద్దది కాబట్టి మిగతా కథ వచ్చే నెలలో తెలుసుకుందాం. మీరు ఆదికాండం 11 నుండి 25 అధ్యాయాలు చదవండి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా బైబిలు చదువుకోండి. **(సశేషం)**


ఇండియా ఎవాంజలిస్టిక్ అండ్ రిలీఫ్ ఫెలోషిప్ వారిచే

**ప్రత్యేక బైబిల్ క్లాసులు**

**తేదిలు 2017 జనవరి 9,10,11**

**సంఘకాపరులు, సువార్తికులకు ఆహ్వానము**

ఉచిత భోజన వసతి, స్టయిఫండ్, రాను పోను చార్జీలు ఇవ్వబడును. హాజరైన ప్రతిఒక్కరికీ ప్రత్యేక బహుమతి కలదు. రిజిస్టర్ చేసుకోడానికి **<SBC-2017>** అని మీ పేరు, అడ్రసు, ఫోన్ నంబరు మాకు **9440217726** నంబరుకి **SMS** పంపండి


# సహాయం (చిన్నకథ)

ఊరికి దూరంగా కారు ఆగిపోయింది. అందులో నుండి దిగిన ఆమెకు 40 సం॥లు ఉంటాయి. చూస్తే టైర్ పంచర్ అయ్యింది. టైరు మార్చటం ఆమెకు చేతకాదు. సమయం సాయంత్రం ఆరున్నర అయ్యింది. చీకటి పడుతుంది. సహాయం కోసం అటు వెళ్తున్న కార్లను ఆపడానికి చెయ్యెత్తితే ఎవరూ ఆపలేదు. అంతలో చీకటి పడింది. మనసులో భయం మొదలైంది. చుట్టూ ఇళ్ళు లేవు, ఫోన్ చేద్దామంటే మొబైల్‌కి సిగ్నల్ లేదు. ఏం చేయాలో అర్థం కావడంలేదు. అంతలో కారుకు ముందుగా ఒక బైక్ ఆగింది. ఒకతను బైక్ దిగి కారు దగ్గరకు వస్తున్నాడు. ఆమెకు భయం వేస్తుంది. అంతలో అతను నవ్వుతూ దగ్గరకు వచ్చి, 'నా పేరు జాని. మాది ఈ పక్కనే మెకానిక్ షాపు, చలిగా ఉంది, మీరు కార్లో కూర్చోండి నేను టైర్ మార్చేస్తాను' అని చెప్పి డిక్కిలో టైర్ తీసి మార్చేస్తాడు. అప్పుడు ఆమె అతనికి కృతజ్ఞలు తెలియజేసి, అతనికి డబ్బులు ఇవ్వబోతుంది. అప్పుడు అతను "మీరు కష్టంలో ఉన్నారని నేను మీకు సహాయం చేశాను, అలాగే మీరు కూడా ఎవరైనా కష్టంలో ఉంటే నా పేరు చెప్పి వాళ్ళ సహాయపడండి" అని చెప్పి వెళ్ళిపోతాడు. అప్పుడు ఆమె కారెక్కి కొంత దూరం వెళ్ళాక, బాగా ఆకలిగా ఉంటే, రోడ్డు ప్రక్కనే ఉన్న ఒక హోటల్‌కి వెళ్ళి కుర్చీలో కూర్చుని వెయిటర్ కోసం చూస్తుంటే, ఒకామె వచ్చి "అమ్మా, ఏం కావాలి?" అడుగుతుంది. ఏం కావాలో చెప్పినప్పుడు తేవడానికి వెళ్తుంది. ఆమె చూస్తే నిండుగర్భిణి, రేపో మాపో కనడానికి సిద్ధంగా ఉంది. ఆమెను చూసి జాలిపడి ఏదైనా సహాయం చేయాలనిపించింది. అప్పుడు జాని చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. తినడం పూర్తయ్యాక బిల్ కట్టడానికి వెయ్యి రూపాయల నోటు ఇస్తుంది. చిల్లర తేవడానికి వెళ్ళి వచ్చేసరికి ఆమె కారెక్కి వెళ్ళిపోతుంది. ఆమె కూర్చున్న టేబుల్ మీద ఒక కాగితం, దాని క్రింద నాలుగు వెయ్యి రూపాయల నోట్లు ఉంటాయి. ఆ కాగితం చూస్తే దాంట్లో 'నువ్వు నిండు గర్భిణిగా ఉండి పని చేస్తున్నావు అంటే నీకు డబ్బు అవసరం అని తెలుస్తుంది. నాకు ఒక మిత్రుడు సహాయ పడినట్లే అతన్ని తలుచుకొని నీకు సహాయపడుతున్నాను. నువ్వు కూడా ఇతరులకు సహాయపడు' అని రాసి ఉంది. అది చూసి ఆమె కళ్ళ వెంట నీళ్ళు వస్తాయి. ఆ డబ్బు తీసుకొని ఇంటికి వస్తుంది. అలసిపోయి పడుకొని ఉన్న తన భర్త జానితో 'డెలివరీకి డబ్బులెలా అన్నావు కదా, చూడు దేవుడు ఎలా సహాయం చేశాడో' అని జరిగిందంతా చెప్తుంది. అప్పుడు జానికి తను ఆమెకు చేసిన సహాయం గుర్తొస్తుంది.

**మంచి సమరయుడు ప్రతిఫలం ఆశించకుండా దొంగల చేతికి చిక్కిన బాటసారికి సహాయపడ్డాడు. మరి మీరు?**

# పాఠకుల పేజి

'పరిశుద్ధత' పత్రికలో ఈ నెల నుండి 'పాఠకుల పేజీ' అనే శీర్షిక ప్రారంభించుచున్నాము. ఈ పేజీ పూర్తిగా పాఠకులకు కేటాయించబడినది. ఈ పేజీలో మీ కుటుంబ సభ్యుల యొక్క పుట్టినరోజు, పెళ్ళిరోజు వేడుకలకు సంబంధించి వారికి పత్రికా ముఖంగా శుభాకాంక్షలు తెలియజేయవచ్చును. మీ కుటుంబంలోని యువతీ యువకుల వివాహ సంబంధ సమాచారం అలాగే సువార్త సభల సమాచారం, పదవీ విరమణ సమాచారం, జ్ఞాపకార్ధ కూడికల సమాచారం కూడా పంపవచ్చు. పత్రిక గురించి మీరు వ్రాసే ఉత్తరాలు కూడా ఈ శీర్షికలో ప్రచురించబడతాయి. అయితే ఈ అవకాశం ఉపయోగించదలుచుకునే వారు చందాదారులై ఉండాలి. పత్రికకు కట్టిన చందా మొత్తమునుబట్టి వారికి స్థలము కేటాయించబడుతుంది. సంవత్సర చందాదారులకి పేజీలో 1/4, రూ. 500 కట్టిన వారికి 1/2 పేజీ, రూ. 1000 కట్టిన వారికి ఫుల్ పేజీ కేటాయించబడును. రూ. 2000 కట్టిన వారికి టైటిల్ (కలర్) లోపలి పేజీలో 1/2 పేజి. రూ.5000 కట్టిన వారికి టైటిల్ లోపలి ఫుల్ పేజీ కేటాయించబడును. అయితే ఈ అవకాశం సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. ప్రతి నెలా 15వ తేదీ తర్వాత తేదీలలోని సంధర్భాలను మాత్రమే పంపించాలి. ఫోటో ప్రచురించాలంటే మీ ఫోటోని **Whatsapp** ద్వారా 9440217726కి లేదా ఈ-మెయిల్ ద్వారా holiness.ierf@gmail.comకి పంపాలి. పోస్ట్‌లో పంపకూడదు.

## 'పరిశుద్ధత' 2017 క్యాలెండర్

**రంగురంగుల 'పరిశుద్ధత' 2017 క్యాలెండర్ పాఠకులకు ఉచితం. కావలసిన వారు వెంటనే <CAL2017> అని టైపు చేసి మీ పేరు, మీ పత్రిక సీరియల్ నంబర్ 9440217726 నంబరుకి SMS పంపించి మీ కాపీ రిజర్వ్ చేసుకోండి. SMS పంపించిన వారికి మాత్రమే పంపబడుతుంది**

## బైబిల్ క్విజ్-23 ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :

**కె. లాజరస్,** కొయ్యలగూడెం, ప.గో.జిల్లా
**పి.ఎస్తేర్‌రాణి,** శంకవరప్పాడు, అద్దంకి (మం), ప్రకాశంజిల్లా
**బి.ఎస్తేర్‌రాణి,** గోగులమూడి, పెదనందిపాడు(మం), గుంటూరుజిల్లా
**కె.కమల్,** శ్రీరాంపూర్, మంచిర్యాల(మం) ఆదిలాబాద్ జిల్లా
**శ్రీమతి సి.హెచ్. రాజామణి,** ధవళేశ్వరం, తూ.గో.జిల్లా
**టి. చిన్నా,** గొల్లపాలెం, మల్కిపురం (మం), తూ.గో.జిల్లా
**పి.చిన్నారావు,** విజయవాడ, కృష్ణా జిల్లా
**యం.శ్రీకర్‌కుమార్,** జుజ్జూరు, వీరులపాడు(మం), కృష్ణాజిల్లా
**జె.లక్ష్మీనరసింహ,** కొత్తపల్లి, కర్నూలుజిల్లా
**ఆర్.జయమ్మలాబాను,** గుంతకల్, అనంతపురంజిల్లా
**కె.జాన్‌టోని,** ప్రకాశరావుపాలెం, నల్లజర్ల(మం), ప.గో.జిల్లా
**కె.సుభద్ర,** కస్తూరిభాపేట, విజయవాడ, కృష్ణా జిల్లా
**ఇ.వినయ్,** జీనేపల్లి, సిరివెళ్ళ(మం), కర్నూలుజిల్లా
**సి.హెచ్.ప్రకాష్,** జీనేపల్లి, సిరివెళ్ళ(మం), కర్నూలుజిల్లా
**జి.ప్రవల్లిక,** జీనేపల్లి, సిరివెళ్ళ(మం), కర్నూలుజిల్లా
**జి.ఉగ్రనరసింహ,** జీనేపల్లి, సిరివెళ్ళ(మం), కర్నూలుజిల్లా
**జి.అభిషేక్,** జీనేపల్లి, సిరివెళ్ళ(మం), కర్నూలుజిల్లా
**జి.పండు,** జీనేపల్లి, సిరివెళ్ళ(మం), కర్నూలుజిల్లా
**యస్.వంశి,** జీనేపల్లి, సిరివెళ్ళ(మం), కర్నూలుజిల్లా
**కె.వాణికుమారి,** చీరాల, ప్రకాశంజిల్లా
**శ్రీమతి వి.శారాభాయి,** భీమవరం, ప.గో.జిల్లా
**పాస్టర్ ఎ. మత్తయ్య,** నిర్మలనగర్, వినుకొండ(మం), గుంటూరు జిల్లా
**పి.అనిత,** ఇచ్ఛాపురం, శ్రీకాకుళంజిల్లా
**జి.రోజమ్మ,** పేరాల, వేటపాలెం(మం), ప్రకాశంజిల్లా
**కె.శ్రీనివాసుదొర,** సి.టి.నెం.9381, సెంట్రల్‌జైల్, రాజమండ్రి
**ఎస్. నరసింహస్వామి,** గౌతమి బ్లాక్, సెంట్రల్‌జైల్, రాజమండ్రి
**ఎస్.రమ్య,** ధవళేశ్వరం, రాజమండ్రి, తూ.గో.జిల్లా

లక్కిడిప్ ద్వారా **"నా చిత్తానుసారుడు"** అను పుస్తకమును బహుమతిగా పొందిన వారు :
కె.సుభద్ర, కస్తూరిభాపేట, విజయవాడ, కృష్ణా జిల్లా

## బైబిల్ క్విజ్ - 23 జవాబులు

**1.** 30 మంది (1దినవృత్తా.11:11) **2.** 28,600 మంది (12:35) **3.** అబీనాదాబు (13:7) **4.** బయల్పెరాజీము దగ్గర (14:11) **5.** కెనన్యా (15:22) **6.** ఆసాపును అతని సహోదరులను (16:37) **7.** నాతాను ప్రవక్తతో (17:1) **8.** 18000 మంది (18:12) **9.** హానూను (19:1) **10.** లహ్మీ (20:5) **11.** 600 తులముల బంగారము (21:25) **12.** పదికోట్ల మణుగులు (22:14) **13.** 38,000 మంది పురుషులు (23:3) **14.** షెమయా (24:6) **15.** 22వది (25:29) **16.** జెకర్యా (26:14) **17.** యోవాబు (27:34) **18.** సొలొమోను (28:20) **19.** సాదోకు (19:22) **20.** 150 తులముల వెండి (2దిన.1:17)



# అక్షరయజ్ఞం

## బైబిల్ క్విజ్ - 24

2దినవృత్తాంతములు 2 నుండి 2దినవృత్తాంతములు 21 వరకు



**శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్**

1. హీరాము సొలొమోను వద్దకు పంపిన తెలివియు వివేచనగల పనివాని పేరు ఏమిటి? (2దిన. 2 అధ్యా)
2. దేవాలయము ఎదుట కుడితట్టు ఉన్న స్తంభమునకు ఏమని పేరు పెట్టెను? (3వ అ.)
3. జిగటమంటి భూమి ఎక్కడ ఉన్నది? (4వ అ.)
4. యెహోవా ఇశ్రాయేలు వారితో ఎక్కడ నిబంధన చేసెను? (5వ అ.)
5. పరాఙ్ముఖుడవై యుండకుము రెఫరెన్స్ ఏమిటి? (6వ అ.)
6. ఇశ్రాయేలీయులు ఎక్కడ నుండి బహు గొప్ప సమూహముగా కూడి వచ్చెను? (7వ అ.)
7. ఓఫీరు నుండి ఎంత బంగారము తెచ్చెను? (8వ అ.)
8. ఇశ్రాయేలీయును సొలొమోను ఎంతకాలము ఏలెను? (9వ అ.)
9. ఇశ్రాయేలు వారు ఎవరిని రాళ్ళతో చావగొట్టిరి? (10వ అ.)
10. రెహబాము భార్యయైన మయకా తండ్రి ఎవరు? (11వ అ.)
11. రెహబాము తల్లి పేరు ఏమిటి? (12వ అ.)
12. అబీయాకు ఎంతమంది పిల్లలు? (13వ అ.)
13. ఆసా యొద్ద విల్లువేయువారు ఎంతమంది ఉన్నారు? (14వ అ.)
14. ఆసా తల్లి పేరు ఏమిటి? (15వ అ.)
15. ఆసాకు వచ్చిన అనారోగ్యము ఏమిటి? (16వ అ.)
16. యెహోవాకు తన్ను తాను మనఃపూర్వకముగా సమర్పించుకున్నది ఎవరు? (17వ అ.)
17. మీకాయాను చెంప మీద కొట్టినది ఎవరు? (18వ అ.)
18. ఇష్మాయేలు కుమారుని పేరు ఏమిటి? (19వ అ.)
19. దోదావాహు కుమారుని పేరు ఏమిటి? (20వ అ.)
20. యెహోరాముకు పత్రిక వ్రాసిన ప్రవక్త ఎవరు?(21వ అ.)

**గమనిక**

మీ జవాబులను **SMS/Whatsapp/E-mail** ద్వారా కూడా పంప వచ్చును. **SMS/Whatsapp** ద్వారా పంపేవారు మీ పేరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరుతో బైబిల్‌క్విజ్-24 అని టైపు చేసి, ప్రశ్న నంబరు, జవాబు, బైబిల్ రెఫెరెన్సుతో జవాబులన్నీ ఒకే మేసేజ్‌లో 9440217726 నంబరుకు పంపాలి. **E-mail** ద్వారా పంపేవారు సబ్జెక్ట్ దగ్గర మీ పేరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరు, బైబిల్ క్విజ్-24 అని టైపు చేసి ప్రశ్న నంబరు, జవాబు, బైబిల్ రెఫెరెన్సుతో 20 ప్రశ్నలకు జవాబులన్నీ ఒకే మెయిల్‌లో holiness.ierf@gmail.comకి పంపాలి. పోస్టుకార్డు లేదా ఎన్వలప్ కవరు ద్వారా జవాబులు (తెల్లపేపరు మీద, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరు, మీ ఫోన్ నంబరు వ్రాసి) పంపదలచిన వారు ఈ నెల 30వ తేదిలోపు **పరిశుద్ధత-బైబిల్ క్విజ్, పోస్ట్‌బాక్స్ నెం.28, ఒంగోలు-523001** అడ్రసుకు పంపగలరు.

అన్ని ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాసిన ప్రతిఒక్కరికి **"శాశ్వత రక్షణ"** అను పుస్తకము ఉచితంగా పంపబడును

**సీరియల్ నంబరు**
మరియు మీ
**ఫోన్ (మొబైల్) నంబరు**
తప్పని సరిగా వ్రాయాలి. లేనిచో జవాబులు అంగీకరించబడవు.

## చందాదారుల వివరాలు


| | |
|---|---|
| పాస్టరు కె. సామ్యేల్ రాజేంద్రగారు | రూ. 5,000 |
| పాస్టర్ కె. సంగ్రామ్, అమెరికా | రూ. 5,000 |
| కుమారి జయదేవి, గుంటూరు | రూ. 5,000 |
| పాస్టరు విజయచంద్రగారు, బెంగుళూరు | రూ. 3,000 |
| శ్రీమతి కె. కమలాసామ్రాట్, ఒంగోలు | రూ. 3,000 |
| శ్రీమతి ఆనీసైల్స్, హైదరాబాద్ | రూ 3,000 |
| శ్రీ కె. జోనాతానుగారు, చెన్నై | రూ. 2,000 |
| శ్రీ యం. జోసఫ్, రేపల్లె | రూ. 2,000 |
| పాస్టర్ డానియేల్‌గారు, ఒంగోలు | రూ. 1,500 |
| శ్రీమతి ఒక సహోదరి, శ్రీకాకుళం జిల్లా | రూ. 1,200 |
| శ్రీ కె. చక్రవర్తి, హైదరాబాద్ | రూ 1,000 |
| శ్రీ కె. హనోక్, న్యూఢిల్లీ | రూ. 1,000 |
| శ్రీమతి రాణిప్రసాదరావు, రేపల్లె | రూ. 1,000 |
| శ్రీమతి వి.శారాభాయి, భీమవరం (ఆగష్టు) | రూ. 300 |
| శ్రీమతి వి.శారాభాయి, భీమవరం (అక్టోబర్) | రూ. 300 |
| శ్రీమతి రత్నకుమారి, కరీంనగర్ | రూ. 500 |
| శ్రీ పరుసు వెంకటరావు, బెంగుళూరు | రూ. 500 |
| కుమారి లీనా, బెంగుళూరు | రూ. 500 |
| శ్రీమతి విక్టోరియా, మార్కాపురం | రూ. 500 |
| శ్రీమతి మార్తామనోరమ, హైదరాబాద్ | రూ. 500 |
| శ్రీమతి రూత్ ఇవాంజలిన్, ఒంగోలు | రూ. 500 |
| శ్రీమతి అరుణమ్మ, ఒంగోలు | రూ. 500 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. 500 |
| శ్రీమతి సువర్ణరత్నకుమారి, విజయవాడ | రూ. 300 |
| పాస్టర్ పి. సత్యానందం, మౌలాలి, హైదరాబాద్ | రూ. 300 |
| పాస్టర్ జి. నల్లయ్య, కందుకూరు, ప్రకాశంజిల్లా | రూ. 300 |
| శ్రీ ఆర్. ఇన్నయ్య, గుంతకల్లు | రూ. 200 |
| పాస్టర్ కె. జాన్‌మార్క్స్, క్రొత్తపట్నం | రూ. 200 |
| శ్రీ టి. చిన్నా, మల్కీపురం, తూ.గో.జిల్లా | రూ. 200 |
| శ్రీ కొట్టె కమల్, శ్రీరాంపురం, ఆదిలాబాద్ | రూ. 150 |
| పాస్టర్ జె. జయరాములు, కాకినాడ | రూ. 150 |
| పాస్టర్ ప్రకాశం, నారాయణపురం, వరంగల్‌జిల్లా | రూ. 150 |
| శ్రీ కె.జె. జ్యోతిరాజ్, మార్కాపురం | రూ. 150 |
| శ్రీ పి. ఆనంద్‌సాగర్, కాకినాడ | రూ. 150 |
| పాస్టర్ వి.ఎ.యన్.ప్రసాద్, జడ్చర్ల | రూ. 150 |
| పాస్టర్ టి.విజయపాల్, నరసరావుపేట | రూ. 150 |
| శ్రీమతి ఎస్తేర్‌రాణి, గోగులమూడి, గుంటూరు జిల్లా | రూ. 150 |
| పాస్టర్ టి.ఆదాము, శంకరవరప్పాడు, ప్రకాశంజిల్లా | రూ. 150 |

చందాకట్టిన వారిలో ఎవరి పేరైనా లేనిచో దయచేసి 9440217726 నంబరుకి ఫోన్ చేయమని కోరుచున్నాము

## ఈ నెల ప్రశ్న - నవంబర్-2016

### పోతీఫెర కుమార్తె పేరు ఏమిటి?

(ఆదికాండము)




మీ జవాబు ఈ నెల 30వ తేదీలోపు 9440217726 నంబరుకి ఎస్.యం.ఎస్ ద్వారా పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో 'లక్కిడిప్' ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ.125/- లు విలువ చేసే **'ఆంధ్రక్రైస్తవ ఉజ్జీవ కీర్తనలు'** అనే 1000 పాటలు ఉన్న పుస్తకము బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు మాత్రమే ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 30వ తేది లోపు చందా చెల్లించే వారు కూడా పాల్గొనవచ్చును.

అక్టోబర్ నెల ప్రశ్నకు జవాబు పంపించిన వారు
శ్రీమతి జయమ్మలాబాను, గుంతకల్
కొట్టె కమల్, శ్రీరాంపురం, ఆదిలాబాద్
టి. చిన్నా, గొల్లపాలెం, మల్కీపురం (మం), తూ.గో.జిల్లా
పాస్టర్ టి.విజయపాల్, నరసరావుపేట, గుంటూరు జిల్లా
శ్రీమతి ఎస్తేర్‌రాణి, గోగులమూడి, గుంటూరు జిల్లా
పి. ఎస్తేర్‌రాణి, శంకవరప్పాడు, అద్దంకి, ప్రకాశం జిల్లా
ప్రత్తి అనిత, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా

లక్కిడిప్ ద్వారా **'ఆంధ్రక్రైస్తవ ఉజ్జీవ కీర్తనలు'** అను పాటల పుస్తకమును బహుమతిగా పొందిన వారు :
**పి. ఎస్తేర్‌రాణి, శంకవరప్పాడు, అద్దంకి, ప్రకాశం జిల్లా**

### మీరు బ్యాంక్ అకౌంట్ ద్వారా చందా పంపవలసిన బ్యాంక్ అకౌంట్ వివరాలు

| | |
|---|---|
| **Name** | **: K. Joseph** |
| **A/c Number** | **: 10957380353** |
| **Bank** | **: State Bank of India** |
| | **Main Branch, Ongole** |
| **IFSC Code** | **: SBIN0000890** |

మీ చందాను నెట్‌బ్యాంకింగ్ ద్వారానే పంపాలి. చందా పంపిన తర్వాత 9440217726 కి ఫోన్ చేసి చెప్పాలి లేదా మీరు కట్టిన మొత్తము, ట్రాన్‌సాక్షన్ నంబరు మెసేజ్ చెయ్యాలి.